

కేవలం బిసిలకే 42శాతం రిజర్వేషన్లు 2 లో..


# నేటి ప్రభాత సూర్య

జాతీయ తెలుగు దిన పత్రిక

TGTEL/25/A0784



## రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేటి ప్రభాత సూర్య తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

**అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం.**

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు.

9100900918
9100900931


ప్రచురణ : హైదరాబాద్ | ఎడిటర్ : పోలగోని రాజేశ్ | మంగళవారం | 05- 08- 2025 | సంపుటి : 1 | సంచిక : 64 | పేజీలు : 8 | వెల : 4/-



# అసెంబ్లీకి కాళేశ్వరం కథ!

- కాళేశ్వరం కమిషన్‌కు కేబినేట్ ఆమోదం
- అన్ని రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను తీసుకుంటాం
- లక్షకోట్ల ప్రాజెక్టు కుంగిపోవడం బాధాకరం
- అసెంబ్లీలో చర్చకు పెడతామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన




**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదిక కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దీనిని అసెంబ్లీలో పెడతామని అన్నారు. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని చెప్పారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు- తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాక భవిష్యత్తు కార్యాచరణతో పాటు- కమిషన్ సూచనలను అమలు చేసేందుకు ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఎవరిపైనా కక్ష సాధింపులు, వ్యక్తిగత ద్వేషం తమ ఉద్దేశం కాదనే అన్ని వివరాలనూ మీడియా ముందు ఉంచామని తెలిపారు. జలవనరుల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో దాదాపు రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం మేడిగడ్డ కుంగిపోయే ప్రమాదంలో పడింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగాన్ని దృష్టిలో పెట్టు-కొని న్యాయ విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్‌ను నియమించాం. ఘోష్ కమిషన్ అందరితో మాట్లాడి ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఇందులో రాజకీయ ఆరోపణలు లేవు. ఇది ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టు కాదు.. స్వతంత్ర న్యాయ విచారణ కమిషన్ ఇచ్చిన రిపోర్టు. కాళేశ్వరం నిర్మాణం, నిర్వహణ అవకతవకలు అన్నింటికీ బాధ్యుడు, జవాబుదారీ అప్పటి సీఎం కేసీఆరే అని నివేదికలో పేర్కొన్నారు. నిపుణుల కమిటీ-

మిగతా 2వ పేజీలో..

# అది కాంగ్రెస్ కమిషన్

- కొందరిని అరెస్ట్ చేసిన భయపడేది లేదు
- కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ఎండగట్టాలి
- పార్టీ శ్రేణులకు కెసిఆర్ పిలుపు



**గజ్వేల్- నేటి ప్రభాత సూర్య:**

కొంత మంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయవచ్చు.. భయపడ వద్దని వారికి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని అని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాళేశ్వరంపై కేబినెట్‌లో ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూద్దామని పార్టీ నేతలతో మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న కేబినెట్ సమావేశంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నివేదికను పవర్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. అదే సమయంలో ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఊహించినదేనని స్పష్టం చేశారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలను నిర్మించారు. అయితే 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగాయి. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైంది. అనంతరం ఈ ప్రాజెక్ట్‌లో చోటు- చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 15 నెలలపాటు ఈ కమిషన్ విచారణ జరిపింది. చివరకు జులై 31వ తేదీన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. తన నివేదికను నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేసింది. ఆగస్టు 1వ తేదీన

మిగతా 2వ పేజీలో..

## మరోమారు ఎర్రవల్లిలో చండీయాగం

**పూజాకార్యక్రమాలు చేపట్టినట్లు సమాచారం**

గజ్వేల్ :

ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో చండీ యాగం రేపటి నుంచి ప్రారంభం కానుందని ప్రచారం సాగుతోంది. ఈ యాగాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా నిర్వహించను న్నట్లు తెలుస్తోంది. యాగం కోసం సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారని

మిగతా 4వ పేజీలో..




## సృష్టి.. ఫిర్యాదులు అతివృష్టి

- ఫర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం
- పోలీసులకు వరుస ఫిర్యాదులు రాక
- మరో నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు

2 లో..



## కాళేశ్వరం అప్పులపై వడ్డీ తగ్గించే అంశం

- ప్రాజెక్టు పూర్తి చేస్తే పరిశీలిస్తామన్న కేంద్రం
- లోక్‌సభలో ఎంపి చామల ప్రశ్నకు సమాధానం

2 లో..



## సరిహద్దుల్లో చైనా ఆక్రమణలు

- రాహుల్ వ్యాఖ్యలపై సుప్రీం ఘాటు హెచ్చరిక
- ఆధారాలు ఉన్నాయా అంటూ ప్రశ్నలు

2 లో..

# కోమటిరెడ్డి ఆఫీసుకు ఇందిరమ్మ పేరు!

- ఫోన్ చేసి అభినందించిన సిఎం
- జాగృతి కవిత ఎవరో తెలియదు
- కవిత బిసి రిజర్వేషన్ల ధర్నా ఓ జోక్
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్య



**నల్లగొండ- నేటి ప్రభాత సూర్య :**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎవరో తనకు తెలియదు అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కవిత బీసీ ధర్నా జోక్ అని ఎద్దేవా చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంతో కోట్లాడుతాం అని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఎమ్మెల్సీ కవిత ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటం చేస్తా అని కవిత తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు. మినిస్టర్ క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. 'క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో మొదటి ఏడాది నేను బాధపడ్డాను. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుంటే ఆనందంగా ఉంది. కాంగ్రెస్ పార్టీలో అందరూ సమానమే. నల్లగొండ జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్ట్ లను ఏడాదిలో పూర్తి చేస్తాం' అని మంత్రి చెప్పారు. కేబినెట్‌లో జరగబోయే చర్చపై నేను ముందుగా మాట్లాడను. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ నిందితులు జైలుకు వెళ్తారు. నా ఫోన్ ట్యాప్ కాలేదు. ఏపి తలపెట్టిన బనకచర్ల కట్టనివ్వం. కాళేశ్వరం నివేదికపై కేబినెట్‌లో సమగ్రంగా చర్చిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని అందరికీ తెలుసు, ఇప్పటికే కొందరిపై చర్యలు తీసుకున్నాం. కవిత ఎవరో నాకు తెలియదు. కవిత బీసీ

మిగతా 2వ పేజీలో..

# బీసీల బిల్లుకు బీజేపీ అడ్డంకి

- రిజర్వేషన్ల పరిమితి నిబంధన ఎత్తివేయడంలో నిర్లక్ష్యం
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శలు



**యాదాద్రి భువనగిరి - నేటి ప్రభాత సూర్య :**

రిజర్వేషన్లపై యాభై శాతం క్యాప్ ను ఎత్తేసేందుకు కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడిన ఆయన.. బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ బిల్లు గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపించామని.. కానీ కేంద్రం ప్రభుత్వం అడ్డుపడుతోందని అన్నారు. బీసీల పట్ల బీజేపీ పార్టీ కి ప్రేమ లేదన్నారు మహేష్ కుమార్ గౌడ్. మొదటి నుంచి బీసీ రిజర్వేషన్ల పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాహాటంగానే వ్యతిరేకిస్తూన్నారని అన్నారు. ఎస్ సి, ఎస్ టి, బీసీ మైనార్టీల పట్ల ఎందుకు మీకు వివక్ష..? అని కిషన్ రెడ్డి ని సూటిగా ప్రశ్నిస్తున్నట్లు- చెప్పారు. ముస్లింలను సాకుగా చూపించి బీసీ బిల్లును అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్ లో బీజేపీ ప్రభుత్వం ఉందని.. ఇక్కడ మెలిక పెడుతున్నవళ్లు అక్కడ ఎలా అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలని ఆరవతేదీన జంతర్ మంతర్ వద్ద ముఖ్యమంత్రితో సహా అందరూ ధర్నా చేస్తున్నట్లు- తెలిపారు. ఢిల్లీలో చేపట్టనున్న ధర్నా గురించి మాట్లాడిన పీసీసీ చీఫ్.. బీసీ రిజర్వేషన్ల


మిగతా 2వ పేజీలో..

# జార్ఖండ్ మాజీ సిఎం శిబూ సోరెన్ కన్నుమూత

- ఎక్స్ వేదికగా వెల్లడించిన జార్ఖండ్ సిఎం హేమంత్
- సంతాపం ప్రకటించిన రాష్ట్రపతి ముర్ము,ప్రధాని మోడీ

**నేటి ప్రభాత సూర్య డెస్క్ :**

ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూసోరెన్ (81) కన్నుమూశారు. మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ దిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. మన ప్రియనేత దిషోమ్ గురూజీ మనల్ని విడిచివెళ్లిపోయారు. నాకు సర్వం కోల్పోయినట్టుగా ఉంది' అని ఉద్వేగపూరితంగా రాసుకొచ్చారు. ప్రస్తుతం బిహార్‌లో భాగమైన రామ్‌గఢ్ జిల్లాలో శిబూసోరెన్ జన్మించారు. ఆయన సతీమణి పేరు రూపీ సోరెన్. ఆయనకు నలుగురు



మిగతా 2వ పేజీలో..

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

- ఇందిరాపార్క్ వద్ద ఎమ్మెల్సీ కవిత దీక్ష
- కోర్టు అనుమతి నిరాకరణతో విరమణ



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం హైదరాబాద్‌లో ప్రకటించారు. ఈ నిరాహార దీక్షకు కోర్టు అనుమతి నిరాకరించిందని చెప్పారు. దీంతో తాను చేపట్టిన ఈ దీక్షను విరమిస్తున్నట్లు- తెలిపారు. కోర్టులను ధిక్కరించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కోర్టుల పట్ల తనకు గౌరవం ఉందన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పులు ఎత్తి చూపుతూ.. బీసీల తరపున పోరాటం చేస్తున్నామని చెప్పారు. మేము ఒక్క అడుగు వెనక్కి వేస్తే.. 10 అడుగులు ముందుకు వేస్తామని కవిత చెప్పారు. కోర్టు తీర్పును గౌరవించి ఈ దీక్షను ఇంతటితో ముగిస్తున్నామన్నారు. ఈ పోరాటం ఆగదని.. అనేక రూపాల్లో చేస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ధర్నాలతో సాధించేది ఏం లేదన్నారు. మీరు రాష్ట్రపతి వద్దకు వెళ్లండంటూ తెలంగాణ ప్రభుత్వంలోని పెద్దలకు ఆమె సూచించారు. అంతకుముందు ఆమె ఇందిరాపార్క్ వద్ద

మిగతా 2వ పేజీలో..

# కేవలం బిసిలకే 42శాతం రిజర్వేషన్లు

- 10శాతం ముస్లిం రిజర్వేషన్లను అంగీకరించం
- తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**



కేవలం బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే భాజపా పూర్తి మద్దతిస్తుందని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. ఇందులో ముస్లిం రిజర్వేషన్లను అంగీకరించబోమని అన్నారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దిల్లీలో కాంగ్రెస్ ధర్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో చేసినట్లే దిల్లీకి వెళ్లి నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు ముస్లింలకు 10శాతం ఇస్తామని చెప్పలేదు. బీసీలకే 42 శాతం అమలు చేస్తామంటే పూర్తి మద్దతిస్తాం. ముస్లింలకు 10 శాతం ఇస్తే.. 10 శాతం బీసీలకు అన్యాయం జరుగుతుంది. రిజర్వేషన్లను భాజపా అడ్డుకుంటోందని ప్రచారం చేస్తోన్న కాంగ్రెస్‌ను బీసీలు నమ్మరని అన్నారు. బిసిల పేరు చెప్పి ముస్లింలకు ఇచ్చే కుట్రలను అడ్డుకుంటామని అన్నారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ఉద్దేశం లేదని రామచందర్‌రావు అన్నారు. ముస్లింలకు 10 శాతం ఇస్తే, పదిశాతం బిసిలకు అన్యాయం జరుగుతుందని ఆవేదనను వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే పాత రిజర్వేషన్లే కొనసాగించాలనేది ఉద్దేశం అని రామచందర్ రావు పేర్కొన్నారు.

# సృష్టి.. ఫిర్యాదులు అతివృష్టి

- ఫర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం
- పోలీసులకు వరుస ఫిర్యాదులు రాక
- మరో నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ సంస్థ నిర్వాహకులు ఐవీఎఫ్ చికిత్సకు వచ్చిన వారిని సరోగసి పేరిట మోసం చేసి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదులు అందాయి. పలువురు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో ఈ మేరకు గోపాలపురం పోలీసులు మరో 4 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. తమకు అందించిన మెడికల్ రిపోర్టులు తీసుకొచ్చి బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. నల్గొండకు చెందిన దంపతుల నుంచి ఫెర్టిలిటీ నిర్వాహకురాలు నమ్రత రూ.44 లక్షలు కాజేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు నమ్రత, సదానందం, చెన్నారావు, అర్చన, సురేఖపై కేసు నమోదైంది. హైదరాబాద్‌కు చెందిన బాధితురాలి ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. సరోగసి చేస్తామని బాధితురాలికి నమ్రత హార్మోన్ ఇంజక్షన్‌లు ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత కల్యాణి గ్యాంగ్ విశాఖకు పిలిచి స్పెర్మ్ తీసుకొని పంపింది. ఈ వ్యవహారంలో సరోగసి పేరుతో రూ.18 లక్షలు కాజేశారు. ఈ ఘటనకు సంబంధించి నమ్రత, డా.విద్యులత, కల్యాణి, శేషగిరి, శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదైంది. ఎన్నారైలను కూడా నమ్రత గ్యాంగ్ మోసం చేసినట్లు- ఫిర్యాదు అందింది. బాధితుల నుంచి రూ.25 లక్షలు కాజేశారు. దీంతో నమ్రతపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన బాధితుల నుంచి ఈ గ్యాంగ్ రూ.50 లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నమ్రత, చెన్నారావు, సురేఖపై కేసు నమోదు చేశారు.



# కాళేశ్వరం అప్పులపై వడ్డీ తగ్గించే అంశం

- ప్రాజెక్టు పూర్తి చేస్తే పరిశీలిస్తామన్న కేంద్రం
- లోక్‌సభలో ఎంపి చామల ప్రశ్నకు సమాధానం

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేస్తే అప్పులపై వడ్డీ తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రుణాల చెల్లింపు, రీ షెడ్యూల్ మార్పు చేస్తే ఆర్బీఐ నిబంధనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు ఖాతా స్టాండర్డ్ నుంచి సబ్ స్టాండర్డ్‌కు డౌన్ గ్రేడ్ అవుతుందని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల పునర్ వ్యవస్థీకరణ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నుంచి వినతులు వచ్చాయి. ప్రాజెక్టు స్పెషల్ పర్పస్ వెహికల్‌కు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ రుణాలు ఇచ్చాయి. పీఎఫ్‌సీ, ఆర్ఈసీ లాంటి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు.. వివిధ మార్గాల్లో నిధులను సేకరిస్తాయి. వాటికయ్యే ఖర్చుల ఆధారంగా వడ్డీ రేట్లను నిర్ణయిస్తారు. ప్రాజెక్టు పూర్తయ్యే సమయాన్ని ఇప్పటికే డిసెంబర్ 2024కు ఆర్ఈసీ పొడిగించింది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాతే రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపును పరిశీలిస్తాం అని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది.కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల రిస్ట్రక్చర్‌కు తెలంగాణ ప్రభుత్వం నుంచి వినతులు వచ్చాయని కేంద్రమంత్రి పంకజ్ చౌదరి గుర్తుచేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యే సమయాన్ని ఇప్పటికే డిసెంబర్ 2024కు ఆర్ఈసీ పొడిగించిందని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపు పరిశీలిస్తామని చెప్పుకొచ్చారు.

# సరిహద్దుల్లో చైనా ఆక్రమణలు

- రాహుల్ వ్యాఖ్యలపై సుప్రీం ఘాటు హెచ్చరిక
- ఆధారాలు ఉన్నాయా అంటూ ప్రశ్నలు

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**

సుప్రీంకోర్టు సోమవారం రాహుల్ గాంధీకి గట్టి హెచ్చరికలు జారీ చేసింది. 2020 గల్వాన్ వ్యాలీలో జరిగిన ఘర్షణల గురించి ఆయన చేసిన కామెంట్స్ కారణంగా ఈ హెచ్చరిక చేసింది. రాహుల్, తన భారత్ జోడో యాత్రలో చైనా 2,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిందని, ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని సరెండర్ చేశారని పేర్కొన్నారు. ఆ మాటలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీహ్‌ల బెంచ్ రాహుల్‌ని సీరియస్‌గా ప్రశ్నించింది. 2,000 చదరపు కిలోమీటర్ల భూమిని చైనా తీసుకుందని మీరు ఎలా తెలుసుకున్నారని ప్రశ్నించింది? మీరు నిజమైన భారతీయులైతే అలా మాట్లాడరు కాదా అని జస్టిస్ దత్తా అడిగారు. మీరు అక్కడ ఉన్నారని, మీ దగ్గర ఏమైనా నమ్మదగిన ఆధారాలు ఉన్నాయా అని అడిగింది. రాహుల్



తరపున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ వాదించారు. రాహుల్ అలాంటి మాటలు చెప్పకపోతే, ఆయన ప్రతిపక్ష నాయకుడిగా ఎలా ఉంటారని సింఘ్వీ అన్నారు. దీనికి జస్టిస్ దత్తా మరి ఇలాంటివి పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడటం లేదన్నారు. అయినా, ఈ కేసును కొట్టివేయాలన్న రాహుల్ విజ్ఞప్తిపై కోర్టు నోటీసు జారీ చేసింది. ఈ కేసు కొనసాగనుందని చెప్పింది. సింఘ్వీ, ఈ కేసులో కొన్ని తప్పులు జరిగాయని చెప్పారు. పోలీసులు రాహుల్‌కి ముందస్తు విచారణ అవకాశం ఇవ్వకుండానే కేసు నమోదు చేశారని వాదించారు. గతంలో, మే నెలలో అలహాబాద్ హైకోర్టు కూడా రాహుల్ పిటిషన్‌ను తిరస్కరించింది. లక్నోలో ప్రత్యేక కోర్టు రాహుల్‌కు ఫిబ్రవరిలో సమన్స్ జారీ చేసి, ఆయనపై విచారణకు ఆదేశించింది. హైకోర్టు జడ్జి సుభాష్.. స్వేచ్ఛగా మాట్లాడే హక్కు అంటే సైన్యాన్ని అవమానించేలా మాట్లాడే హక్కు కాదని పేర్కొన్నారు. ఈ కేసు మొదట 2022 డిసెంబర్‌లో ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో బయటకొచ్చింది. రాహుల్ గాంధీ సైన్యం గురించి అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు. రాహుల్ మాత్రం ఈ ఆరోపణలు రాజకీయంగా ప్రేరేపితమని చెప్పారు. రాహుల్ ఈ విషయాన్ని పలుమార్లు పునరావృతం చేశారు. 2023 జనవరిలో జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో కూడా, చైనా మన భూమిని ఆక్రమించిందన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని ఖండించింది.

# అసెంబ్లీకి కాళేశ్వరం కథ!

మొదటిపేజీ తరువాయి..

సూచనలకు కాకుండా సొంత నిర్ణయంతోనే మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై విచారణ చేయిస్తామని మేనిఫెస్టోలో చెప్పామని, కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించిన పీసీ ఘోష్ నిబద్ధత ఉన్న వ్యక్తి అని రేవంత్ చెప్పారు. కేసీఆర్, హరీష్ రావు సహా అనేక మందిని ఘోష్ విచారించారని, 16 నెలల విచారణ తరువాత 665 పేజీల నివేదిక ఇచ్చారని సీఎం తెలిపారు. ఊరు, పేరు, అంచనాలు మార్చి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని..అలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిపోయిందని సీఎం విమర్శించారు. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రాణహిత చేవెళ్లను ప్రారంభించారని, రీడిజైనింగ్ పేరుతో కేసీఆర్ డిజైన్లను మార్చారని ఆరోపించారు. ప్రాజెక్ట్ నిర్మించిన మూడేళ్ల లోపే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని సీఎం గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్లలో కూడా లోపాలున్నాయని రిపోర్ట్ ఇచ్చిందని సీఎం రేవంత్ చెప్పారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని, త్వరలోనే అసెంబ్లీకి నివేదికను రిపోర్ట్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని పార్టీల సూచనలు, అభిప్రాయాలు తీసుకుంటామని సీఎం తెలిపారు. అందరి ఆమోదం మేరకు ఏం చేయాలో నిర్ణయిస్తామని రేవంత్ చెప్పారు. ప్రజాప్రతినిధులకు కమిషన్ నివేదిక ఇస్తామని, అందరూ స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పొచ్చని సీఎం రేవంత్ వెల్లడించారు. ఎవరి పైనా వ్యక్తిగత ద్వేషంతో నిర్ణయాలు తీసుకోవడం లేదని, కమిషన్ రిపోర్ట్‌పై ఎవరు ఏ రకంగా మాట్లాడతారనేది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# అది కాంగ్రెస్ కమిషన్

మొదటిపేజీ తరువాయి..

పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఈ నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. ఈ నివేదికపై ముగ్గురు అధికారులతో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఆదివారం సమావేశమై.. చర్చించింది. ఈ కమిటీ అందించిన నివేదికపై తెలంగాణ సచివాలయంలో సోమవారం జరిగిన కేబినెట్ భేటీ-లో ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అదీకాక లక్షల కోట్ల రూపాయిలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసింది. ఇంకా చెప్పాలంటే.. ఈ ప్రాజెక్ట్‌కు కర్మ, కర్త, క్రియ అంతా కేసీఆర్ అని చెప్పకనే చెప్పింది. ఇదిఆవుంటే కేసీఆర్ యాగం చేయనున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

# కోమటిరెడ్డి ఆఫీసుకు ఇందిరమ్మ పేరు!

మొదటిపేజీ తరువాయి..

ధర్నా జోక్. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంతో కొట్లాడుతాం. ఆర్డినెన్సును సాధిస్తాం. నారా లోకేష్‌కు రాజకీయ అవగాహన లేదు. భనకచర్లపై అవసరమైతే కేంద్రంపై కొట్లాడుతాం. బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకుంటాం' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేడు నల్లగొండ జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. మినిస్టర్ క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశారు. ఆపై యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డికి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను, భూమి పూజకు సంబంధించిన వివరాలను సీఎంకు మంత్రి వివరించారు. స్కూల్ నిర్మాణ పనులకు భూమి పూజ, క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కందూరు జైవీర్ రెడ్డి హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డికి ఫోన్ చేయగా.. స్పీకర్ ఆన్ చేసి మాట్లాడారు. మీరు మరలా సీఎం కావాలని ప్రత్యేక పూజలు చేశా అని సీఎంకు మంత్రి తెలిపారు. అందుకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఆపై మిగతా ఎమ్మెల్యేలతో సీఎం మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నల్గొండలో 22 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రే-టె-డ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను నిర్మిస్తున్నారు. తెలంగాణ విద్యా రంగంలో యంగ్ ఇండియా ఇంటిగ్రే-టె-డ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా విప్లవాత్మక మార్పు ప్రారంభం కానుంది. పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని, తెలంగాణ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ-పడాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు- మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు ఇక్కడ ఉంటాయని చెప్పారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే చారిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.

# బీసీల బిల్లుకు బీజేపీ అడ్డంకి

మొదటిపేజీ తరువాయి..

బిల్లు సాధన-కై- పన్నెండు వందల మంది నాయకులు -ట్రైన్ ద్వారా ఢిల్లీ వెళుతున్నట్లు- తెలిపారు. వాకిటి శ్రీవారి , పొన్నం ప్రభాకర్, ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తో కలిసి చర్లపల్లి నుంచి నాయకుల తో ఆలేరు వరకు -ట్రైన్ లోజర్నీ చేసినట్లు- చెప్పారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు యావత్ దేశానికి తెలంగాణ రోల్ మోడల్ గా మారిందన్నారు.

# జార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ కన్నుమూత

మొదటిపేజీ తరువాయి..

సంతానం. ముగ్గురు కుమారులు హేమంత్, బసంత్, దుర్గా సోరెన్. కుమార్తె పేరు అంజలి. 2009లో దుర్గా సోరెన్ మృతి చెందారు. బసంత్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. సంతాల్ కమ్యూనిటీ-కి చెందిన శిబు సోరెన్... వామపక్ష నేత ఏకే రాయ్, కుర్మి మహతో బినోద్ బిహారీ మహతోతో కలిసి 1972లో ఝార్ఖండ్ ముక్తి మోర్చాను ఏర్పాటు-చేశారు. తర్వాత ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన పోరాటంలో కీలక నేతగా ఎదిగారు. ఆ పోరాట ఫలితంగా 2000లో ఝార్ఖండ్ రాష్ట్రంగా ఏర్పడింది. 2005లో ఆయన తొలిసారి సీఎం అయ్యారు. ఆయన మూడు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ.. ఒక్కసారి కూడా పూర్తికాలం పదవిని నిర్వహించలేక పోయారు. 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించినా.. అక్కడా అదే పరిస్థితి. 1974 నాటి కేసు కారణంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. తన మాజీ కార్యదర్శి హత్య కేసులో దోషిగా తేలడంతో మరోసారి కేంద్రమంత్రి పదవిని కోల్పోయారు. ఒక హత్యకేసులో కేంద్రమంత్రి దోషిగా తేలడం అదే తొలిసారి. అయితే దిల్లీ హైకోర్టు తర్వాత ఆయన్ను నిర్దోషిగా తేల్చింది. శిబూ సోరెన్‌కు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఆయన ఎనిమిది సార్లు లోక్‌సభ, రెండు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలియజేశారు. శిబూసోరెన్‌జీ అట్టడుగు స్థాయి నుంచి ప్రజాజీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగారు. ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. గిరిజనులు, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడం కోసం కృషి చేశారు. ఆయన మరణం బాధాకరం. ఇప్పుడు ఆయన కుటు-ంబం, అభిమానుల గురించే నా ఆలోచనంతా. ఇప్పటికే హేమంత్ సోరెన్‌జీతో మాట్లాడాను. ఓం శాంతి అని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు.. శిబూ సోరెన్ ఈరోజు ఉదయం 8:56 గంటలకు మరణించినట్లు-ప్రకటించారు. మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న సోరెన్‌కు నెలన్నర క్రితం స్ట్రోక్ వచ్చింది. ఆయన దాదాపు నెల రోజులుగా లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌లో ఉన్నారు. వైద్యుల బృందం ఐసీయూలో నిరంతరం ఆయన్ని పర్యవేక్షించింది. కానీ చివరికి ఆయన్ని కాపాడలేకపోయారు.



# బిఆర్ఎస్‌కు గువ్వల బాలరాజు రాజీనామా

**మహబూబ్‌నగర్- నేటి ప్రభాత సూర్య :** భారత్ రాష్ట్ర సమితి పార్టీకి పెద్ద షాక్‌గా మాజీ ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు డా. గువ్వల బాలరాజు రాజీనామా చేశారు. సోమవారం తన పదవులు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం సులభం కాదని, ముఖ్యంగా ఐక్యత అవసరమైన ఈ సమయంలో బాధతో తీసుకున్న నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. మన నాయకత్వంలో నేర్చుకున్నాను, ఎదిగాను, సేవ చేసాను. పార్టీ ద్వారా లభించిన గుర్తింపు, గౌరవాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటానని గువ్వల తెలిపారు.అలాగే, నా మిషన్ మాత్రం కొనసాగుతుంది - చివరి వరుసలో ఉన్న వ్యక్తిని నిలబెట్టడం నా లక్ష్యం అని స్పష్టం చేశారు. గువ్వల బలరాజు తన రాజీనామా వెనుక ఎటు-వంటి నిందలు లేవని, కేవలం గౌరవం , కృతజ్ఞతతోనే పార్టీకి వీడ్కోలు చెబుతున్నానని చెప్పారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

దీక్షకు దిగారు. తెలంగాణ జాగృతి ఈరోజు చేసే పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. బీఆర్ అంబేడ్కర్, ఫులే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు ఆమె నివాళి అర్పించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున కార్యకర్తలు, తెలంగాణ జాగృతి శ్రేణులు తరలివచ్చి ఆమెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి ఒక్కరికీ రాజ్యాధికారంలో వాటా కావాలి, ఆర్థిక అవకాశాలు రావాలి. సమాజంలో సగ భాగం బీసీలు ఉన్నారు. వాళ్లకు రాజకీయంగా సమ ప్రాధాన్యం దక్కాలనే ఉక్కు సంకల్పంతో



ఈ దీక్ష చేపట్టాం. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లు బీసీలకు న్యాయం చేయాలని గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడుతున్నాం. అందరి ఆకాంక్ష ఒకటే.. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం భాజపా మీద నెపం పెట్టి తప్పించు కోవాలని చూస్తోంది. బీసీ బిల్లుపై భాజపా లేవనెత్తిన అనుమానాలను సీఎం నివృత్తి చేయాలి. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వాలి. ముస్లింలను మినహాయించి బీసీలకే 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పాలి. అప్పుడు భాజపా ఎందుకు ఒప్పుకోదో మేమూ చూస్తాం. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్‌కు ప్రత్యేకంగా పార్లమెంటులో బిల్లు పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇందుకు కృషి చేయాలని కవిత అన్నారు.

# పైసా పేకో తమషా దేకో!

- ఆదిబట్ల మున్సిపల్‌లో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..
- అక్రమ నిర్మాణాలపై చలనంలేని అధికారులు...
- పత్రికల్లో కథనాలు వచ్చినా చర్యలకు వెనుకడుగు..
- టౌన్ ప్లానింగ్ పనితీరుపై తీవ్ర విమర్శలు



**పైసా పేకో తమషా దేకో అన్న చందంగా తయారైంది. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.ఏలాంటి అనుమతులు లేకుండా నిబంధనలు తుంగలో తొక్కి సెల్లార్ తో పాటు బహుళ అంతస్తు భవనం నిర్మిస్తున్నారు. వీటికి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సహకరిస్తుండటంతోనే అనుమతులు లేని నిర్మాణాలు విచ్చలవిడిగా వెళుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.**

ఆదిబట్ల -నేటి ప్రభాత సూర్య:

నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా తయారైంది ఆదిబట్ల మున్సిపల్ పరిస్థితి. మున్సిపల్ పరిధిలో అక్రమ, అదనపు అంతస్థుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.ఆ భవనాలలో పార్కింగ్ సదుపాయం, సెట్ బ్యాకు లేకపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. విచ్చలవిడిగా సాగుతున్న నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. పట్టించుకోకపోవడంతో మున్సిపల్ తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.. నిబంధనలకు మించి నిర్మాణం చేపడితే నోటీసులు ఇచ్చి సదరు నిర్మాణాన్ని నేలమట్టం చేస్తాం'..ఇది టౌన్‌ప్లానింగ్ అధికారులు, కమిషనర్ చెప్పే మాట..కానీ క్షేత్రస్థాయిలో మాత్రం కాసులకు కక్కుర్తి పడుతూ అక్రమార్కులకు అధికారులు కొమ్ముకాస్తున్నారు.అనుమతులు ఇచ్చి వదిలేస్తున్నారు. కానీ అనుమతి పొందిన నిర్మాణదారుడు అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులతో చెలరేగిపోతున్నా..ఆ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఫిర్యాదు చేసినా..ఒత్తిడి తెచ్చినా.. కేవలం నోటీసులతో సరిపెడుతున్నారే తప్ప.. ఆపై చర్యలకు వెళ్లడం లేదు.



## రెసిడెన్షియల్ అనుమతులు, కమర్షియల్ నిర్మాణాలు...

ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఇంజినీరింగ్ కాలేజీలు, విద్యా సంస్థలు పెద్ద ఎత్తున ఉన్నాయి. దీంతో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతోంది. హాస్టళ్లకు డిమాండ్ ఉంది. దీన్ని ఆసరగా చేసుకుంటున్న అక్రమ నిర్మాణదారులు... రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని... కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమంగా పెంట్ హౌస్‌లు నిర్మిస్తున్నారు. చిన్న స్థలంలో పెద్ద నిర్మాణాలు చేపడుతూ భద్రతకు తిలోదకాలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేకపోవడం పట్ల స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## స్పందించని మున్సిపల్ కమిషనర్...

ఆదిభట్ల మున్సిపల్ పరిధిలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ ను వివరణ కోరేందుకు ' నేటి ప్రభాత సూర్య ప్రతినిధి చరవాణిలో ప్రయత్నించగా ఆయన స్పందించకపోవడం గమనార్హం.



# సంపాదకీయం

## చట్టాలు కాలరాచి నీతివాక్యాలా?

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ మారడంపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పెద్దగా సంచలనం కలిగించ లేదు. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీం ధర్మాసనం తీర్పు ఇచ్చినా పెద్దగా చర్చ సాగలేదు. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందని బిఆర్ఎస్ ఆశపడింది. కానీ అలా జరగలేదు. అయితే ఈ విషయంలో ఎవరికి వారు తీర్పుపై తమకు అనుకూలంగా భాష్యాలు చెప్పుకున్నారు. నిజానికి చట్టాలను ఉల్లంఘిస్తున్న వారు చట్టాలను అమలు చేయాలని కోరడమే పెద్ద తప్పు. ఎన్నో చట్టాలను చట్టుబండలు చేసిన నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యేల విషయంలో మాత్రమే వారిని అనర్హులను చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చింది. ఎందుకంటే వారు అధికారంలో ఉండగా గంపగుత్తగా టిడిపి, సిపిఐ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్న విషయం ప్రజలు మరచిపోలేదు. వారిని ఎలా చేర్చుకున్నా తప్పే. ఎందుకంటే రాజకీయంగా నిజాయితీగా లేరని ఈ విషయం స్పష్టం చేసింది. దీనికి వక్రభాష్యాలు చెప్పడం బిఆర్ఎస్ నేతలు మానుకోవాలి. గొర్రెల స్కామ్‌లో వేయికోట్లు, కాళేశ్వరంలో లక్షకోట్లు, రైతుబంధులో వేలకోట్లు, ఈ ఫార్ములా రేసులో కొన్ని కోట్లు ఇలా దోచుకుని చట్టాలను చట్టుబండలు చేసి, ప్రజాధనాన్ని దోచుకున్న వారికి ఫలాన చట్టం అమలు చేయాలని కోరడం లేదా డిమాండ్ చేయడం సరికాదు. అలాంటి అర్హత వారికి ఎప్పటికీ లేదు. అందుకే సుప్రీం తీర్పు వచ్చినా ప్రజల్లో ఎక్కడా పెద్దగా స్పందన కానరావడం లేదు. ఇక సుప్రీం తీర్పు అమలు చేయాలంటే బిఆర్ఎస్ ప్రభుత్వం గురించి ఓ విషయం చెప్పుకోవాలి. హైదరాబాద్‌లో ఉమ్మడి ఎపిలో వైఎస్ సిఎంగా ఉన్న సమయంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చారు. దీనిపై కోర్టులో నలిగి చివరకు సుప్రీం కోర్టు జర్నలిస్టులకు స్థలం అప్పగించాలని ఆదేశించింది. సుప్రీం చీఫ్ జస్టిస్ ఇచ్చిన ఆదేశాన్ని కూడా ఆనాటి కెసిఆర్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఆనాడు సుప్రీం తీర్పును పట్టించుకోని, అమలు చేయని పాలకులు బిఆర్ఎస్ నేతలు. తీర్పులను పట్టించుకోని వీరు పాలనకు అనర్హులు. చట్టాలను ఉల్లంఘించడం, వాటిని అమలు చేయకపోవడం, పూర్తిగా అవినీతిలో కూరుకు పోవడం, కుటుంబ సభ్యులకే పదవులు కట్టబెట్టుకోవడం వంటి అనేక అరచకాలకు పాల్పడ్డవారు పాలకలుగా అనర్హులు. అలాంటి వారు సుప్రీం తీర్పు అమలుచేయాలని కోరడంలో అర్హత లేదు.

ఇకపోతే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉందని బిఆర్ఎస్ ప్రచారం చేసుకుంటోంది. ఈ పరిస్థితుల్లో ఉప ఎన్నికలు వస్తే గెలుపు తమదే అన్న ధీమాతో బిఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించి ఉంటుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సహజంగానే ఉప ఎన్నికలు వస్తే ఇబ్బంది ఉంటుంది. అందుకే ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి పార్టీ ఫిరాయిస్తే అనర్హత వేటు పడుతుందన్న భయం లేకపోతే ఎమ్మెల్యేలు గెలిచిన పార్టీలో కాకుండా అధికారంలో ఉన్న పార్టీలో ఉంటారు. బిఆర్ఎస్ నుంచి ఏడాది క్రితమే మరో పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టేవారు. ఇప్పటకే ఓ 20 మంది గోడదూకేవారు. ఈ నేపథ్యంలో ఎన్నికైన సభ్యులు చేజారి పోకుండా కాపాడు కోవడంతో పాటు, పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉందని పార్టీ శ్రేణుల్లో నమ్మకం కల్పించేం దుకు బీఆర్ఎస్ నానాతంటాలు పడుతోంది. అందుకే ఉప ఎన్నికలు రావాలని కోరుకుంటోంది. ఈ కారణంగానే మూడు నెలల తర్వాత ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఆ పార్టీ ప్రచారం చేసుకుంటోంది. నిజానికి ఒకప్పుడు చట్ట సభల స్పీకర్లు పార్టీలకు అతీతంగా, న్యాయబద్ధంగా నడుచుకొనేవారు. వారి నిర్ణయాలు పార్టీలకు అతీతంగా చట్టబద్దంగా ఉండేవి. కాలక్రమంలో స్పీకర్లు చట్టసభల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల ప్రయోజనాలకు అనుగుణంగా స్పీకర్లు నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారు.

గత బిఆర్ఎప్ ప్రభుత్వ హయాంలో నాటి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఇలాగే వ్యవహరించారు. పార్టీ ఆదేశాల మేరకు నడుచుకున్నారు. ఆనాడు లేని నిబంధనల గురించి ఇవాల బిఆర్ఎస్ వాదిస్తోంది. నిజానికి సభలోఅసలు చర్చకే ప్రాధాన్యం లేకుండా పోయింది. కేవలం ఇప్పుడే మళ్లీ అసెంబ్లీలో చర్చలు సాగుతున్నాయి. స్పీకర్లు సరైన నిర్ణయం తీసుకోక పోవడం వల్లనే స్పీకర్ల అధికారాల్లో జోక్యం చేసుకొవాలని సుప్రీం గడప తొక్కుతున్నారు. సర్వోన్నత న్యాయస్థానానికి సైతం పరిమితులు ఉన్నందున వివాదాలు సత్వరం పరిష్కారం కావడం లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు అన ర్హత వేటు వేస్తుందని బీఆర్ఎస్ ఆశించింది. అప్పటికే పార్టీ ఫిరాయించిన వారిపై సుప్రీం కోర్టు చర్యలు తీసుకుంటుందని బలంగా చెప్పడం ద్వారా మరి కొందరు పార్టీ ఫిరాయించకుండా బీఆర్ఎస్ అడ్డుకోగలిగింది. అయితే సుప్రీం కోర్టు తీర్పు ఆ పార్టీకి ఆశాభంగం కలిగించింది. ఫిరాయింపుల విష యంలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు మూడు నెలల గడువు విధించింది. ఈ గడువుకు లోబడి స్పీకర్ నిర్ణయం తీసుకోని పక్షంలో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది.

ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలన్నా, చట్టసభలు-న్యాయ వ్యవస్థ మధ్య ఘర్షణ తలెత్తరాదన్నా నిర్ణయాలు తీసుకోవడంలో స్పీకర్‌కు పార్లమెంటు గడువు విధించాలని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో పేర్కొంది. స్పీకర్ వద్ద వివాదాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడం సరికాదు. ఫిరాయింపుల నిరోధక చట్టం అపహాస్యం కాకుండా సత్వర చర్యలు తీసుకోవాలి. పాలకులుగా ఏ పార్టీ వారు ఉన్నా చట్టాలు సక్రమంగా అమలు కావాలి. అధికార పార్టీ ప్రయోజనాలు కాపాడటానికి స్పీకర్లు ప్రాధాన్యం ఇస్తున్నందున సమస్యలు వస్తున్నాయి. సకాలంలో నిర్ణయాలు వెలువడటం లేదు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన కొంత మంది ఎమ్మెల్యేలను నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇలా చేయడం అనైతికం, అక్రమం అని టీఆర్ఎస్ అధినేతగా ఉన్న కేసీఆర్ ఆక్రోశించారు. ఒక పార్టీ తరఫున గెలిచిన వారిని మరో పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక,ముఖ్యమంత్రి అయిన కెసిఆర్ కూడా కాంగ్రెస్-తెలుగుదేశం -కమ్యూనిస్టు పార్టీలకు చెందిన సభ్యులను తమ పార్టీలో కలుపుకొన్నారు. అప్పట్లో శాసనసభలో కేసీఆర్‌కు బొటాబొటి మెజారిటీ మాత్రమే ఉన్నందున భయంతో వీరిని చేర్చుకున్నారు. అయినా ఆనాడు తప్పని వాదించిన కెసిఆర్ తరవాత అదే పద్దతిలో వెళ్లడం ముమ్మాటికీ తప్పుగానే భావించాలి. రెండోసారి కెసిఆర్ ముఖ్యమంత్రి అయినప్పుడు కూడా సభలో సొంతంగా కావల్సినంత మెజారిటీ ఉన్నా కాంగ్రెస్, తెలుగుదేశం సభ్యులను చేర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లభించకుండా చేశారు. నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చిన కేసీఆర్ చర్యను అంతా ఆక్షేపించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అప్పట్లో తన చర్యను సమర్థించుకున్న బిఆర్ఎస్‌కు ఇవాళ కాంగ్రెస్ చర్యలు వ్యతిరేకించడం సరికాదు. అందువల్ల స్పీకర్లు చట్టబద్దంగా వ్యవహరించాలి. పాలకులు చట్టబద్దంగా నడుచుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

# మరోమారు ఎర్రవల్లిలో చండీయాగం

మొదటిపేజీ తరువాయి..

చెబుతున్నారు. ఈ పూజా కార్యక్రమంలో కేసీఆర్‌తో పాటు- కేటీఆర్, హరీష్ రావు, జగదీశ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ చండీ యాగం మూడు రోజుల పాటు- కొనసాగనుంది. మంగళవారం నుంచి అధికారికంగా యాగం ప్రారంభమవుతుందని అంటున్నారు. ఒకవైపు యాగం ఏర్పాట్లు- జరుగుతుండగానే, ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ముఖ్య నాయకులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపైనే ప్రధానంగా చర్చలు జరిగినట్లు సమాచారం. యాగంతో పాటు రాజకీయపరమైన కీలక చర్చలు కూడా ఫామ్‌హౌస్‌లో కొనసాగాయిన, ప్రధానంగా కాళేశ్వరంపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారని తెలుస్తోంది.

# గిరిజన హక్కుల కోసం పోరాడిన నేత

**జార్ఖండం ఉద్యమంతో స్వరాష్ట్రం సాధించుకున్న నేత.. ప్రజల్లో చిరస్థాయిగా నిలిచి పోయిన గిరిజన నాయకుడు**

**నేటి ప్రభాత సూర్య డెస్క్:**

శిబూ సోరెన్ ఆదివాసీ నాయకుడిగా, జార్ఖండ్ ముక్తి మోర్చా (ఓ::) స్థాపకుడిగా చేసిన కృషి రాష్ట్ర రాజకీయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. సామాన్యుల హక్కులు, ఆదివాసీ సమాజ ఉద్ధరణ కోసం అలుపెరగని పోరాటం చేశారు. రాజకీయ నాయకుడిగానే కాక, సామాజిక సంస్కర్తగా ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంది. శిబూ సోరెన్ 1944 జనవరి 11న జన్మించారు. జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు- కోసం నడిపిన ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. మూడుసార్లు జార్ఖండ్ ముఖ్యమంత్రిగా (2005లో 10 రోజులు, 2008-2009, 2009-2010) పనిచేశారు. ఆయన దుమ్కా లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఏకంగా ఎనిమిది సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 2004, 2004-2005, 2006లో కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా పనిచేశారు. జెఎంఎ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన శిబు సోరెన్ జనవరి 11, 1944లో జన్మించారు. నెమ్రా గ్రామంలో ఉమ్మడి బీహార్‌లో భాగమైన..ప్రస్తుతం జార్ఖండ్‌లో న్మించారు. ఆయన తండ్రి షోబరన్ సోరెన్. శిబు సోరెన్‌కు 15 ఏళ్ల వయసున్నప్పుడు వడ్డీవ్యాపారులు చేసిన దాడిలో తన తండ్రి షోబరన్ మృతి చెందాడు. ఈ ఘటన శిబు సోరెన్‌పై తీవ్ర ప్రభావం పడింది. హజారిబాగ్‌లోని గోలా హైస్కూల్‌లో శిబు సోరెన్ మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. రూపి సోరెన్‌ను జనవరి 1, 1962లో వివాహమాడారు. వీరికి నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు దుర్గా సోరెన్ 2009లో మృతి చెందారు. కుమార్తె అంజని జెఎంఎం ఓడిశా యూనిట్‌కు నాయకత్వం వహిస్తుంది. ఆయన చిన్న కుమారుడు బసంత్ సోరెన్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక మరో కుమారుడు హేమంత్ సోరెన్ జార్ఖండ్ రాష్ట్రానికి ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారు. శిబు సోరెన్ మృతితో గిరిజనుల గొంతు వినిపించే జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన ఓ రాజకీయ శకం ముగిసింది. శిబు 'డిషోమ్ గురు' (దేశ నాయకుడు) గా విస్తృతంగా ప్రసిద్ధి చెందారు. గిరిజనుల హక్కుల



కోసం నిరంతరాయంగా పోరాడిన నేతగా ఆయన గుర్తింపు పొందారు. అలాగే ప్రాంతీయ, జాతీయ రాజకీయాల్లో కూడా కీలక పాత్ర పోషించారు. 1973లో ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎ కె రారు, బిహారీ మహతోలతో కలిసి శిబుసోరెన్ జార్ఖండ్ ముక్తి మోర్చా జెంఎంఎంను స్థాపించారు. ఆయన నాయకత్వంలో గిరిజన రాష్ట్రం జార్ఖండ్ కోసం జెఎంఎం పార్టీ ప్రధాన శక్తిగా ఎదిగింది. ప్రత్యేక రాష్ట్రం కోసం చోటానాగ్‌పూర్, సంతల్ పరగణ ప్రాంతాలలో ఈ పార్టీ బలమైన మద్దతును కూడగట్టుకుంది. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి..వారి కలను సాకారం చేసుకున్నారు. వీరి ఆధ్వర్యంలో దశాబ్దాల తరబడి సాగించిన ఆందోళనల తర్వాత నవంబర్ 15, 2000 సంవత్సరంలో జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. శిబు రాజకీయ జీవితం 1980లోనే మొదలైంది. 1980లో ఏడవ లోక్‌సభ ఎన్నికల్లో దుమ్కా స్థానం నుంచి ఆయన పోటీ- చేసి గెలిచారు. ఈ స్థానం నుంచే ఆయన పలుమార్లు గెలిచారు. ఆయన 2020లో రాజ్యసభకు ఎంపీగా కూడా పనిచేశారు. అక్టోబర్ 2024లో గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖకు సంబంధించిన కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. శిబుసోరెన్ మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే ఎప్పుడూ పూర్తికాలం ఆ బాధ్యతల్లో లేరు. కేవలం కొన్నిరోజులు లేక..కొన్ని నెలలే ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యల్లో ఉన్నారు. మార్చి 2-11 2005, ఆగస్టు 27 (2008) - జనవరి 12 (2009) వరకు, డిసెంబర్ 30 (2009) - మే 31 (2010) వరకు ఆయన సిఎంగా ఉన్నారు. యుపిఎ-1 హయాంలో 2004-2006 మధ్య మూడుసార్లు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖామంత్రిగా పనిచేశారు. ఆయన కేంద్ర మంత్రితవర్గంలో ఉన్న సమయంలో.. చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. 1975 చిరుదిహ్ ఊచకోత కేసుకు సంబంధించి సోరెన్‌పై 2004లో అరెస్టు వారెంట్ జారీ చేయబడింది. దీంతో అతను కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్లారు. అయితే ఆయన అరెస్టు అయిన తర్వాత కొంతకాలం కస్టడీలో ఉన్నారు. ఆ తర్వాత బెయిల్ పొందిన తర్వాత తిగిరి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. మార్చి 2008లో ఆయన ఈ కేసులో నిర్దోషిగా విడుదలయ్యారు. 994లో తన మాజీ కార్యదర్శి శశినాథ్ ఝా కిడ్నాప్ మరియు హత్య కేసులో సోరెన్ నవంబర్ 2006లో దోషిగా నిర్ధారించబడ్డారు. 1993లో పి.వి నరసింహారావు ప్రభుత్వంపై జరిగిన అవిశ్వాస తీర్మానం సందర్భంగా రాజకీయ పలుకుబడి కలిగిన ఝా నోరు మూయించేందుకు అతనిని శిబు సోరెన్ హత్య చేశారని సిబిఐ ఆరోపించింది. అయితే సోరెన్ ఈ కేసులో నిర్దోషిగా విడుదలయ్యాడు. ఏప్రిల్ 2018లో సుప్రీంకోర్టు శిబుసోరెన్‌ను నిర్దోషిగా తేల్చింది. జూన్ 2007లో సోరెన్‌ను జైలుకు తీసుకెళుతున్నప్పుడు దేవఘర్ సమీపంలో ఆయన కాన్వాయ్‌పై పేలుడు పదార్థాలు విసిరి హత్యాయత్నం జరిగింది. అయితే ఈ దాడిలో ఆయన తప్పించుకున్నారు. ఆయన రాజకీయ జీవితంలో అస్థిరతలు ఉన్నప్పటకీ జార్ఖండ్‌లో ఆయన ప్రభావం చెక్కుచెదరకుండా ఉంది. ఆయన ఏప్రిల్ 2025వరకు 38 సంవత్సరాలు జెఎంఎం అధ్యక్షుడిగా నాయకత్వం వహించారు. ఆయన కుమారుడు హేమంత్‌సోరెన్ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఏప్రిల్‌లో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. శిబుసోరెన్ దశాబ్దాల రాజకీయ జీవితం.. జార్ఖండ్ రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలుపుతుంది. గిరిజనుల గుర్తింపు, గౌరవం, స్వయంపాలన కోసం చేసిన ఆయన పోరాటం.. ముందు తరాలకు శాశ్వత వారసత్వంగా నిలిచిపోతుంది.


# ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు,ఫెడరల్ స్ఫూర్తికి లోటు

- తెలంగాణ ఏర్పాటులో ఆయన తోడ్పాటు మరువలేనిది
- శిబూసోరేన్ మృతికి కెసిఆర్ సంతాపం

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**



జార్ఖండ్ ముక్తి మోర్చా అధినేత, జార్ఖండ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం వ్యక్తంచేశారు. ఆయన మరణం జార్ఖండ్, తెలంగాణ వంటి దేశ ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు, జాతీయ ఫెడరల్ స్ఫూర్తికి, ఆదివాసీ సమాజానికి తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా శిబూ సోరెన్‌తో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి వారందించిన సహకారాన్ని స్మరించుకున్నారు. దేశ ఫెడరల్ స్ఫూర్తిని ప్రతిఫలించే దిశగా, శిబూ సోరెన్ చేపట్టిన జార్ఖండ్ స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి నింపిందన్నారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపన సమయంలో శిబూ సోరెన్‌ని హైదరాబాద్‌లో జరిగిన తొలి సభకు మొదటి అతిథిగా ఆహ్వానించుకున్నామని గుర్తు చేశారు. నాటి తెలంగాణ ఉద్యమానికి ఆయన తెలిపిన సంపూర్ణ సంఘీభావం మర్చిపోలేనిదని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించిన శిబూ సోరెన్, తాను ప్రారంభించిన తెలంగాణ మలిదశ ఉద్యమానికి అండగా నిలిచారని కేసీఆర్ తన కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేశారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు- సమయంలో కూడా శిబూ సోరెన్ మద్దతుగా నిలిచారని, జార్ఖండ్, తెలంగాణ ప్రజల ఉద్యమ విజయాలు దేశ ఫెడరల్ స్ఫూర్తికి, ప్రాంతీయ, సామాజిక న్యాయానికి దిక్సూచిగా నిలిచాయని కేసీఆర్ తెలిపారు. శిబూ సోరెన్ నేతృత్వంలోని జేఎంఎం పార్టీ తెలంగాణ ఉద్యమ సమయంలో కేంద్రంలో ఉన్న యూపీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండడంతో రాష్ట్ర ఏర్పాటు- కోసం ఒత్తిడి తేవడంలో కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు- అనంతర కాలంలో 2022లో జార్ఖండ్‌లో శిబూ సోరెన్‌ని కలిసి వారి ఆశీస్సులు తీసుకున్న విషయాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తండ్రిని కోల్పోయి దుఃఖ సంద్రంలో మునిగిన వారి కుమారుడు జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు, వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## స్కూటీని ఢీకొన్న లారీ

**ముగ్గురు విద్యార్థుల దుర్మరణం**

**పార్వతీపురం :** ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించి, ఓవర్ స్పీడ్, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాలు వందలాది కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. తాజాగా పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు విద్యార్థులు ప్రయాణిస్తున్న స్కూటీని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు గిరిజన విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులు కొరిసిల గ్రామానికి చెందిన కార్తీక్, ఉదయ్, జగన్ గా గుర్తించారు. మృతుల్లో ఒకే కుంటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. ఉదయ్ కిరణ్ ఇంటర్ సెకండియర్ చదువుతుండగా, కార్తీక్ పాలిటెక్నిక్, జగన్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు- తెలిపారు.

# జర్నలిజంలో నైపుణ్యాలకే ప్రాధాన్యం

**మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

నైపుణ్యంతో కూడిన జర్నలిజాన్ని సమాజానికి అందించాలని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి భవనంలో గిరిజన జర్నలిస్టులకు రెండు రోజులపాటు- శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టులు వృత్తితోపాటు- తమని తాము తీర్చిదిద్దుకుంటూ జర్నలిజంపట్ల ఆసక్తి కనబరిచేలా వార్తలు రాయాలన్నారు. అందులోభాగంగానే గిరిజన జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణా తరగతులు ఏర్పాటు- చేశామన్నారు. అదే విధంగా విడతల వారీగా ఈ జర్నలిస్టుల శిక్షణా



తరగతులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సమాచార శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, గిరిజన జర్నలిస్టులకు మీడియా అకాడమి శిక్షణా తరగతులు నిర్వహించడం గర్వించదగ్గ విషయం అన్నారు. నేను కూడా గిరిజన బిడ్డనే కాబట్టి ఈ విధంగా మిమ్మలను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా శిక్షణలో పాల్గొంటున్న గిరిజన విలేకరులు మన గిరిజన జాతి ఔన్నత్యాన్ని చాటేలా కృషి చేయాలని కోరారు. శిక్షణా తరగతులలో ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు - మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూట్యూబ్ లో వస్తున్న వార్తల గురించి వివరించారు. దిశ ఎడిటర్ మార్కండేయ వార్తా కథనాలు - ప్రత్యేక కథనాలు ఎలా రాయాలో తెలియజేశారు. గిరిజన జర్నలిస్టులు అడవి బిడ్డలు కాబట్టి వారు ప్రత్యేక వ్యాసాలు రాయాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి నేర వార్తల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన ఉండాలని, వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని చేసుకుని వ్రాయాలని ఆయన సూచించారు, అలాగే నేర వార్తలు లలో చేయాల్సినవి చేయకూడనివి అంశాలపై క్లుప్తంగా వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి సమాచార హక్కు చట్టం- 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమి కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు, గిరిజన జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా(నేటి ప్రభాత సూర్య):**
ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని ఇందులో భాగంగా ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్ ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అనాదరణలో కేశంపేట - కోనాయపల్లి రహదారి

**ప్రయాణికులకు తలనొప్పిగా మారిన పరిస్థితి**



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 4):**
హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, ఫార్మసిటీ, త్రిపుల్ ఆర్ వంటి ప్రధాన ప్రాజెక్టులకు అనుసంధానంగా ఉండే కందుకూరు, కేశంపేట మార్గం వయా మహేశ్వరం మీదుగా ప్రయాణించే వాహనదారులకు తలనొప్పిగా మారింది. కేశంపేట మండలంలోని కోనాయపల్లి వరకు రహదారి తీవ్రమైన దెబ్బతిన్న స్థితిలో ఉంది.కందుకూరు మండల పరిధిలో రహదారి విస్తరణ పూర్తవగా, కేశంపేట మండలంలో మాత్రం అదే మార్గం పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజూ ఈ మార్గాన్ని వాడే వాహనదారులకు ప్రయాణం నరకంగా మారిందని స్థానికులు వాపోతున్నారు.ఈ నేపథ్యంలో, షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ రహదారి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతూ, భారతీయ జనతా పార్టీ కేశంపేట మండల శాఖ డిమాండ్ చేసింది. మాజీ బీజేపీ మండల అధ్యక్షులు రొల్లు రఘురాం గౌడ్ మాట్లాడుతూ, "ఇది సాధారణ రహదారి కాదు... ప్రాముఖ్యమైన ప్రాంతాలను కలుపుతున్న మార్గం. త్వరితగతిన అభివృద్ధి చర్యలు చేపట్టాలి" అని తెలిపారు.

## రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లో సింబాకు బంగారు పతకం

**ఉత్తమ నార్కోటిక్ డాగ్‌గా ఎంపిక**

**సిపి అంబర్ కిషోర్ అభినందనలు**






**మంచిర్యాల జిల్లా, (నేటి ప్రభాత సూర్య): ఆగస్టు 4:**
వరంగల్ జిల్లా మమునూరులో జరిగిన రెండవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో రామగుండం పోలీస్ కమీషనరేట్‌కు చెందిన నార్కోటిక్ డాగ్ 'సింబా' చక్కటి ప్రతిభను కనబరిచి బంగారు పతకం గెలుచుకుంది. కాళేశ్వరం జోన్ తరఫున పోటీకి హాజరైన సింబా, తన హ్యాండ్లర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం. వేణుగోపాల్ కృష్ణ సమక్షంలో గంజాయి, మత్తు పదార్థాలను గమనించి గుర్తించడంలో అద్భుత ప్రదర్శన కనబర్చింది.ఈ విజయంతో సింబా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పోలీస్ డాగ్‌గా ఎంపికయ్యింది. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ తమ కార్యాలయంలో సింబాను, డాగ్ హ్యాండ్లర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "ఈ ఘనత రామగుండం కమీషనరేట్ గర్వపడే సంఘటన. రాబోయే 2026 ఫిబ్రవరిలో పూణేలో జరగనున్న నేషనల్ డ్యూటీ మీట్‌లో సింబా మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తెచ్చేలా ఆశిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఐపీఎస్, పెద్దపల్లి డీసీపీ పి. కరుణాకర్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి, సంపత్, మల్లేశం తదితర అధికారులు పాల్గొన్నారు.

# రక్తదానం అంటే ప్రాణదానం

- రక్త నిల్వలు ఆపదలో ఉన్న వారికి ఎంతో అవసరం
- కలెక్టర్ జితేష్ పాటిల్
- మణుగూరులో నూతన బ్లడ్ బ్యాంక్ ప్రారంభం
- రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన కలెక్టర్







**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా(నేటి ప్రభాత సూర్య):**
రక్తదానం అంటే ప్రాణం దానమని ఈ విషయంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ పేర్కొన్నారు. మణుగూరులోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతన ఏర్పాటు చేసిన రక్త నిల్వ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ రిబ్బన్ కటింగ్ చేసి బ్లడ్ బ్యాంక్ లో ఏర్పాట్లను పరిశీలించారు. రక్త నిల్వ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ స్వయంగా రక్తదానం చేసి ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారు.
అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం అంటే ప్రాణదానం మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ఇతరరికి జీవం పోసే వరంగా మారుతుందన్నారు. గర్భిణీలు తలసీమియా సికిల్ సెల్ అనీమియా వంటి వ్యాధులతో బాధపడేవారు ప్రమాదాల వల్ల గాయపడిన వారు రక్తానికి ముఖ్యంగా ఆధారపడతారని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ సంవత్సరంలో కనీసం రెండు సార్లు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా రక్తహీనతతో బాధపడే గర్భిణీలు తల సేమియా సికిల్ సెల్ అనీమియా వంటి రోగులకు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ రక్తం ప్రాణ రక్షణగా మారుతుందన్నారు. మణుగూరులో ఈ రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు కావడం ద్వారా అత్యవసర పరిస్థితులలో పేషెంట్లకు రక్తాన్ని సమీపంలోనే అందుబాటులోకి తేవచ్చు అని తెలిపారు. ఇప్పటి వరకు రక్త అవసరాల కోసం ఖమ్మం భద్రాచలం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని ఇకపై అది అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన స్ఫూర్తితో డి సి హెచ్ ఎస్ డాక్టర్ రవిబాబు, ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ సునీల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు సిబ్బంది ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 20 మంది రక్తదానం చేశారు. నూతనంగా ప్రారంభించిన రక్తనిల్వ కేంద్రానికి సరిపడా రక్త నిల్వల కోసం ఈ రక్తాన్ని ఉపయోగిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు నర్సులు పారామెడికల్ సిబ్బంది శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "డ్రగ్స్ ఫ్రీ" ఉద్యమానికి విశేష స్పందన




**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్, అల్వాల దర్శన్ గౌడ్ (ఆగస్టు 4):**
షాద్‌నగర్‌లో యునైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "డ్రగ్స్ ఫ్రీ షాద్‌నగర్" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. విజయ కార్డియాక్ ఆసుపత్రి అధినేత డాక్టర్ చందూలాల్ రాథోడ్ సహకారంతో, ఈడెన్ ప్లాజాలో 1500 మంది విద్యార్థుల సాక్షిగా భారీగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "డ్రగ్స్ వ్యసనానికి రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు సైతం బానిసలయ్యారు. గతంలో డ్రగ్ మాఫియా పాలకుల ఆమోదంతో పెచ్చుమీద నీళ్లు పోయినట్టు పెరిగింది. కానీ సీఎం రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత ఈ మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపారు" అని వ్యాఖ్యానించారు. విద్యార్థులు మత్తుకు బానిసలవకుండా, తమ కుటుంబ ఆశయాలను నిలబెట్టాలని ఆయన సూచించారు. "విద్యార్థులు యాంటి డ్రగ్ వారియర్లుగా మారాలి. సమాజాన్ని రక్షించడానికి ముందుండాలి" అంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి యాంటి నార్కోటిక్



బ్యూరో అధికారి పి. సీతారాం, డీఎస్పీ సైదులు, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమార్ తదితరులు హాజరై, డ్రగ్స్‌ను ఎదుర్కొనేందుకు ప్రతి యువకుడూ బాధ్యత తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి "డ్రగ్ ఫ్రీ సమాజం నా బాధ్యత" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యంగా ఫౌండేషన్ నిర్వాహకులను ఎమ్మెల్యే, పోలీసు అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, న్యాయవాది సబియా సుల్తానా, సామాజిక కార్యకర్తలు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల సందర్శన సూచనలు




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి ప్రభాత సూర్య):**
కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాల్ సోమవారం పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అకాడమిక్ రంగాభివృద్ధికై కృషి చేయాలని సూచించారు. చిట్టి రామవరం తండాలోని ప్రభుత్వ పాఠశాలను, నేతాజీ రామవరంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే విధానాలను విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సాధ్యమయ్యే రీతుల్లో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులే మనకు వీఐపీలు కావున వారు ఉన్నత వ్యక్తిత్వాలను పొందేలా కృషి చేయాలన్నారు.

## ప్రజావాణిలో భూ సమస్య, పారిశుధ్యంపై ఫిర్యాదులు



**మంచిర్యాల జిల్లా :(నేటి ప్రభాత సూర్య): ఆగస్టు 4:**
బెల్లంపల్లి పట్టణ తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు దరఖాస్తులు అందాయి. పట్టణ పరిధిలో ఒకరు భూసంబంధిత సమస్యపై ఫిర్యాదు చేయగా, మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం మరోరు ప్రజావాణిలో లేవనెత్తారు.దరఖాస్తులు అందుకున్న వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తాహసీల్దార్ తెలిపారు. ప్రజావాణిలో పొందిన ఫిర్యాదులపై క్రమంగా నివారణ చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## బుగ్గ దేవాలయంలో అన్నదానం



**మంచిర్యాల జిల్లా. (నేటి ప్రభాత సూర్య):ఆగస్టు 4:**
బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ బుగ్గ రాజ రాజేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాత కుమ్మరి బాను సహకారంతో భక్తులకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మాసాడి శ్రీదేవి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జిల్లపెల్లి స్వరూప వెంకటస్వామి డైరెక్టర్స్ ములకూరి బాలకృష్ణ, కస్తూరి శ్రీహరి, బామాండ్లపల్లి భరత్ పాల్గొన్నారు.

# సకాలంలో ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ వేణుగోపాల్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి ప్రభాత సూర్య):**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ హౌసింగ్ పీడీ రవీందర్ నాథ్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.
ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులు కొన్ని ఇలా ఉన్నాయి.
రామవరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చిట్టి రామవరం తండా 19వ డివిజన్లో నివసిస్తున్న గిరిజన లంబాడి పోడు రైతులు కొంతమంది సర్వే నెంబర్ 20 లో గల ఆర్వో ఎఫ్ ఆర్ అటవీ శాఖ పోడు భూములను గత 40 సంవత్సరాలుగా పూర్వీకుల నుండి పోడు నరికి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని గతంలో మొత్తం 340 మంది పోడు రైతులు పట్టాల కొరకు దరఖాస్తు చేయగా అందులో 97 మంది రైతులకు మాత్రమే పట్టాలు మంజూరు అయ్యాయని కమిగిలిన వారికి పట్టాలు మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం భద్రాచలం ఐటీడీఏ పీవోకు ఎండార్స్ చేశారు.
చంద్రుగొండ మండలం వెంకట్య తండా పంచాయతీ పరిధిలోని కరశలబోడు తండాలో నివసిస్తున్న పోడు వ్యవసాయం చేస్తున్న రైతు ధారావత్ లక్ష్మి బాలు తాము ప్రభుత్వ అనుమతితో బోరు వేసుకున్నామని అట్టి బోరుకు విద్యుత్ కనెక్షన్ కొరకు 200 మీటర్లు ఉన్న ట్రాన్స్ఫారం నుండి తీసుకునేందుకు అనుమతించాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం జయమ్మ కాలనీలో నివాసం ఉంటున్న పెనుగొండ రాజేశ్వరి వీర కుమార్ భార్యాభర్తలు వివిధ కారణాల చేత విడిపోవడం జరిగిందని రామానుజవరం గ్రామంలో సర్వేనెంబర్ 853లో సుమారు 0.20 కుంటల భూమిని తనకు రాసి ఇవ్వడం జరిగిందని అట్టి భూమి మణుగూరు సింగరేణి కాలరీస్ ఓపెన్ కాస్ట్ విస్తరణలో భాగంగా భూసేకరణకు గురి అవుతున్నందు వలన తనకు రాసిచ్చిన భూమి నష్టపరిహారం తనకు ఇప్పించవలసిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఈ సెక్షన్ సూపర్డెంట్ కు ఎండార్స్ చేశారు.
ఇల్లందు రెండవ నెంబర్ బస్తీలో నివాసం ఉంటున్న సిలువేరు చంద్రావతి తాను ఒంటరి మహిళలను అని తనకు వితంతు పింఛన్ మంజూరు చేయవలసిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం డి ఆర్ డి ఓకు ఎండార్స్ చేశారు.చర్ల మండలం చర్ల గ్రామంలో నివాసం ఉంటున్న భోగాల శివ తన తాతగారైన కొండమల్ల నరసింహారావు వాజేడు తాసిల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తూ చనిపోయారని తన తాతగారి ఉద్యోగం తమ కుటుంబానికి ఏ విధమైన సంబంధం లేనటువంటి



వ్యక్తి తప్పుడు ధృవపత్రాలు సృష్టించి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారని కావున పూర్తి విచారణ జరిపి న్యాయం చేకూర్చాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం కలెక్టరేట్ పరిపాలన అధికారికి ఎండార్స్ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ఎంతో అభివృద్ధి

**బోసు పల్లి ప్రతాప్, జరుపుల విజయ నాయక్**

**మొండి గౌరెల్లి లో ఇంటింటి కార్యక్రమం విజయవంతం**



యాచారం నేటి ప్రభాత సూర్య ( ఆగస్టు 04):
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి మండల ఎన్నికల కన్వీనర్ బోసుపల్లి ప్రతాప్, బిజెపి మండల అధ్యక్షుడు జరుపుల విజయ్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలో మొండి గౌరెల్లిలో బిజెపి గ్రామ కమిటీ 49,50 బూత్ అధ్యక్షులు కర్నాటి నరేష్, ఎడెల్లి సత్తయ్య ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ. మహా సంపర్క్ అభియాన్ పథకం ద్వారా నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పోషకాహారం, రక్తహీనత తక్కువ బరువును తగ్గించడానికి ఈ పథకం ఉపయోగపడుతుంది. గర్భిణీలు పాలిచ్చే తల్లులకు ఈ దృష్టిని సారిం చాలన్నారు. అంగన్వాడి సేవలను వినియోగించుకోవడం, మెరుగుపరచడం ద్వారా, అంగన్వాడి సేవలో నాణ్యతను పెంచుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మేకల యాదగిరి రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్, బిజెపి మండల మాజీ అధ్యక్షుడు తాంద్ర రవీందర్, కొలన్ మల్లారెడ్డి, గోగి కార్ రమేష్, అంబుజి జగదీష్ యాదవ్ ,రాయి కంటి విజయ్ కుమార్, నాయిని పాండురంగారెడ్డి ,పుప్పాల శాంతి కుమార్, వన్నవాడ రవీందర్ రెడ్డి, ఎలిమినేట్ శ్రీనివాస్ రెడ్డి, మాధవ్ జంగయ్య ,దేవరకొండ ఈశ్వర్, కుంచారం సందీప్ రెడ్డి, కొండపురం నాగరాజు, కుంటి మల్లేష్, గూడాల వెంకటేష్ ,రమేష్ ముదిరాజ్, లింగం, మండల లక్ష్మయ్య, కుమ్మరి దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎద్దుకు మెరుగైన వైద్యం అందించిన మూగ జీవుల సేవా సంఘం సభ్యులు

**గాయపడిన ఎద్దుకు ఆదివారం మైడిబులర్ బోన్ సర్జరీ చేసిన డాక్టర్ తిరుపతి, డాక్టర్ శంకర్ లింగం..**

**మూగజీవులు ఆపదలో ఉంటే సంప్రదించు ఫోన్ నెంబర్ 9703525504**



మంచిర్యాల జిల్లా (నేటి ప్రభాత సూర్య):ఆగష్టు 4:
మందమర్రి మండలం రామకృష్ణాపురంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ప్రాంగణంలో ఒక ఎద్దుకు ఆర్ కె 6 మైన్ దగ్గర గుర్తు తెలియని వాహనం యాక్సిడెంట్ చేయడంతోని క్రింది దవడ మొత్తం విరిగిపోయినందున అరుదైన చికిత్స మైడిబులర్ బోన్ సర్జరీ జరిగింది.ఈ సర్జరీలో మందమర్రి మండల వెటర్నరీ వైద్యాధికారిడాక్టర్.తిరుపతి,మంచిర్యాల వైద్యాధికారి డాక్టర్.శంకర్ లింగం, గోపాలమిత్ర పానుగంటి శ్రీనివాస్,మూగ జీవుల సేవా సంఘం సభ్యులు పాల్గొని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు శస్త్ర చికిత్స చేయడం జరిగినది.సాటి మనిషిని పట్టించుకునే తీరిక,ఓపిక,సమయం కూడా ఎవ్వరికి లేదు ఎటు పోతే మన కెందుకులే అని అనుకునే రోజులివి. ఎవరైనా ఆపదలో ఉన్నా, ఇబ్బందుల్లో ఉన్నా..చూసీ చూడ నట్లు వెళ్లిపోతున్నారు.మనిషిలో జాలి,దయ కనుమరుగై పోతున్నాయి.మనుషులనే పట్టించుకోని ఈ రోజుల్లో మూగ జీవాల గురించి పట్టిం చుకునే వారు లేరు.

# రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం



మంచిర్యాల జిల్లా. (నేటి ప్రభాత సూర్య): ఆగష్టు. 4:
బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీని సోమవారం నుంచి ప్రారంభించారు. పట్టణంలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ "గత పది ఏళ్లుగా రేషన్ కార్డులు లభించక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. డిసెరవింగ్ లబ్ధిదారులందరికీ ఇప్పుడు కార్డులు అందడంతో ఆర్థిక భరోసా లభిస్తుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి





**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా(నేటి ప్రభాత సూర్య):
క్రమశిక్షణతో విధులు నిర్వర్తించినప్పుడే గుర్తింపు లభిస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జిల్లా ఆర్మడ్ రిజర్వు విభాగంలోని అన్ని కార్యాలయాలను సోమవారం ఆయన జిల్లా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు సిబ్బంది క్రమశిక్షణతో నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పోలీస్ శాఖలో వినియోగించే సాంకేతికతను శిక్షణను నేర్చుకుంటూ ప్రజలకు సేవలు అందించడంలో ముందుండాలని తెలిపారు. పోలీస్ శాఖలో పని చేసే ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా కూడా దృఢంగా ఉండాలని అందుకుగాను ప్రతిరోజూ వ్యాయామంతో పాటు యోగా ధ్యానం వంటి వాటిని అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. అనంతరం అధికారులు సిబ్బంది యొక్క సమస్యలు తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు రావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎంటిఓ సుధాకర్, ఆర్ఐ హోమ్ గార్డ్స్ నరసింహారావు, ఆర్ఐ అడ్మిన్ లాల్ బాబు, ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంపీఎఫ్ వ్యవస్థను పూర్తిగా ఆన్లైన్ చేయాలి

- **పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి**
- **సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం డిమాండ్**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా(నేటి ప్రభాత సూర్య):
సీఎంపీఎఫ్ వ్యవస్థను పూర్తిగా ఆన్లైన్ చేయాలని పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. సోమవారం సింగరేణి మెయిన్ హాస్పిటల్, కార్పొరేట్ ఏరియాలో పిట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పిట్ సెక్రటరీ తాళ్లపల్లి శ్రవణ్ కుమార్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పి.బి.కె.ఎం.ఎస్ కార్యదర్శి వేజ్ బోర్డు సభ్యుడు మాధవ నాయక్, యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.సారంగపాణి పాల్గొని ప్రసంగించారు. సీఎంపీఎఫ్ వ్యవస్థను పూర్తిగా క్రమబద్ధీకరించి ఆన్లైన్ పరంగా పారదర్శకంగా చేయాలని పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఎంపీఎఫ్‌లో జరుగుతున్న అవకతవకాలపై పోరాటం చేస్తున్న ఏకైక కార్మిక సంఘం బి.ఎం.ఎస్ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. బొగ్గుగనుల్లో పనిచేసిన కార్మికులకు ఈపీఎఫ్ తరహాలో రూ.15,000 పెన్షన్ పథకంలో 1.16 శాతం కేంద్ర సహకారాన్ని వెంటనే జమ చేయాలని తద్వారా పెన్షన్ శాశ్వతంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పదవీ విరమణ చేసిన సింగరేణి ఉద్యోగులకు కొత్త వేజ్ బోర్డు ప్రకారం పెరిగిన పెన్షన్ను తక్షణమే జమ చేయాలని పెన్షన్ వ్యవస్థను పారదర్శకంగా సమర్థవంతంగా ఆన్లైన్ ఆధారితంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జి.వెంకటరెడ్డి, కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షులు జీవి కృష్ణారెడ్డి, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి, ఆర్జీ-2 ఏరియా ఉపాధ్యక్షులు వడ్డేపల్లి కుమారస్వామి, ఆర్జీవన్ ఏరియా సెక్రటరీ సాయివేణి సతీష్, కార్పొరేట్ సెక్రటరీ ఉట్ల గణేష్, అజ్మీర వెంకటేశ్వర్లు, మోహనలాల్, పుష్ప కుమారి, లక్ష్మణ్, అరవింద్, చంద్రశేఖర్, చందు కృపాచలం తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్ పరస్పర శాఖల సహకారంతో ఆపరేషన్ ముస్కాన్-9 విజయవంతం

**193 మంది బాల కార్మికుల విముక్తి - 18 కేసులు నమోదు**



మంచిర్యాల జిల్లా, (నేటి ప్రభాత సూర్య):ఆగష్టు4:
రామగుండంబాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-9 కార్యక్రమం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో విజయవంతంగా ముగిసింది. జూలై 1 నుండి 31 వరకు జరిగిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 193 మంది బాల బాలికలను గుర్తించి వారి బాధ్యతను తల్లిదండ్రులకు అప్పగించడం, పాఠశాలల్లో చేర్పించడం వంటి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా 18 కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమాన్ని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పోలీస్ శాఖలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్, హెల్త్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్ శాఖలతో కలిసి సమన్వయంగా నిర్వహించినట్టు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ తెలిపారు.
పెద్దపల్లి జిల్లాలో బాలురు-52, బాలికలు-19 మంది కలిపి మొత్తం 71 మంది బాల కార్మికులను గుర్తించారు. వారిలో 8 మందిని విముక్తి చేసి పాఠశాలల్లో చేర్పించి, 6 కేసులు నమోదు చేశారు.మంచిర్యాల జిల్లాలో బాలురు -84, బాలికలు-38 మంది కలిపి మొత్తం 122 మంది బాలల్ని రక్షించగా, 13 మందిని బాల కార్మికులుగా గుర్తించి వారి రక్షణ కోసం చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించినంగా 12 కేసులు నమోదు చేశారు.ఈ కార్యక్రమానికి ప్రతి డివిజన్ స్థాయిలో ఒక ఎస్ఐ నేతృత్వంలో నాలుగు మందితో కూడిన ప్రత్యేక బృందాలను నియమించి, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృత తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా కమిషనర్ ఝా మాట్లాడుతూ, "బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత. ఎవరు బాలలను పనుల్లో పెట్టినా, రోడ్డుపై భిక్షాటన చేయిస్తున్నా, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వగలరు," అని తెలిపారు.ఆపరేషన్ ముస్కాన్-9 విజయవంతం కావడంలో తోడ్పడిన వివిధ శాఖల అధికారులకు, సిబ్బందికి పోలీస్ శాఖ తరపున కమిషనర్ అభినందనలు తెలిపారు.

# మహాసంపర్క్ అభియాన్‌లో గడపగడపకు బిజెపి



చింతపల్లి- నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 4)
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా చింతపల్లి మండల కేంద్రంలోని 40బూతు అధ్యక్షుడు గజ్జి అభినవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ఇంటింటికి భారతీయ జనతా పార్టీ ప్రచారం చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి రాష్ట్ర కార్యదర్శి సమ్మిడి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ గారు 11 సంవత్సరాల కాలంలో చేసినటువంటి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రపంచంలో భారత దేశాన్ని విశ్వ గురువుగా నిలబట్టే ప్రయత్నం చేస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు.కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని ప్రతి బూతులో పార్టీని సంస్థగతంగా బలోపేతం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని ఎంపీటీసీలు, జడ్పీటిసి, సర్పంచులు, వార్డు మెంబర్లను గెలిపించాలని ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు సముద్రాల నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చేనిమోని రాములు, మండల ప్రబారి తూటుపల్లి రవి కుమార్, సీనియర్ నాయకులు దావ శ్రీనివాస్, కుకుడపు రామకృష్ణ, మాజీ సర్పంచ్ బొడ్డు శ్రీనివాస్, శివర్ల రమేష్, నాళ్ళ శివకుమార్, ప్రధాన కార్యదర్శులు వెన్నం శేఖర్, గొడుగు శ్రీనివాస్, గొడ్డేటి మధు, వనం శేషు, కుందేళ్ళ చెన్నయ్య, క్రాంతి రెడ్డి, కట్ట నరసింహ్మా, జ్ఞానేశ్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండాలి

**- పనులు త్వరితగతిన పూర్తిచేయించే బాధ్యత అధికారులదే**

**- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా(నేటి ప్రభాత సూర్య):
అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండాలని పనులు త్వరితగతిన పూర్తిచేయించే బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మూడు మండలాల పరిధిలో అభి వృద్ధి పనులకు ఎన్ఆర్ఈజీఎస్, సిఆర్ఆర్, ఎస్సిపి, డిఎం ఎఫ్టి, వివిధ సంస్థల సిఎస్ఆర్ నిధులు రూ.665.31కోట్లు మంజూరు కాగా ఈ నిధులతో పూర్తయిన పనులకు ఎ మ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ప్రారంభోత్స వాలు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ ఒక్కరోజే 103 పనులకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు జరిగాయని తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని సాటివారిగూడెం, చాతకొండ, హమాలీ కాలనీ, సంజయ్ నగర్, అశోక్ నగర్ పంచాయతీల్లో రూ.414.5 కోట్లతో చుంచుపల్లి మండలంలో రూ.64లక్షలు, సుజాతనగర్ మండలంలో రూ.87.37 లక్షలతో సిసి రోడ్లు డ్రైన్లు కమ్యూనిటీ హాళ్లు ప్రభుత్వ భవ నాలు వాటర్ ట్యాంకుల ప్రారంభోత్సావాలు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. రాష్ట్రంలోనే కొత్తగూడెం నియో జకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు తపిస్తు న్నాని ప్రజలకు మౌలిక వసతులు కల్పించేవరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు. పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందు బాటులోకి తేవాలని పూర్తయిన పనుల నిర్వహణ బాధ్యత మున్సిపల్ గ్రామపంచాయతి ఇతర ప్రభుత్వ శాఖలదేనన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఈఈ వెం కటేశ్వర్ రావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిర, పంచాయతి రాజ్ డిఈ రామకృష్ణ, ఏఈ శివలాల్, మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ శాఖా, ఐటిసిపి అధికారులు, వ్యవ సాయ శాఖ, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్, సత్యనారాయణాచారి, నేరెళ్ల రమేష్, నేరెళ్ల శ్రీనివాస్, జగన్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, మిర్యాల రాము, జనార్ధన్ రెడ్డి, పెద్దబాబు, లక్ష్మీపతి, మునిగడప వెంకటేశ్వర్లు, పద్మ, నగేష్, రమేష్, తూముల శ్రీనివాస్, లగడపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి ప్రభాత సూర్య):
కరకగూడెంలోని కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులు కంప్యూటర్ ల్యాబ్ వంటగది మరుగుదొడ్లను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో మమేకమై వారికి అందుతున్న సదుపాయాలు విద్య బోధన ఏమైనా సమస్యలు ఉన్నాయా? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో బాలికలకు సమగ్ర విద్యను అందించడంలో కస్తూరిబా బాలికల విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన వసతులు భద్రతా ప్రమాణాలు ఆరోగ్యకరమైన ఆహారం కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రతి విద్యార్థి చదువులో ఉన్నత స్థాయికి చేరేందుకు అవసరమైన పరిసర వాతావరణం పాఠశాలలో ఉండాలని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనలో రాజీ ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిసరాలు పరిశుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనం అందించాలి అని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పాఠశాల ఆవరణలో మునగ కరివేపాకు ఉసిరి మొక్కలను విస్తృతంగా నాటాలన్నారు. విద్యార్థులకు ఔషధ మొక్కలపై అవగాహన కల్పించాలని అన్నారు. పాఠశాలల్లో మురుగునీరు బయటకు వెళ్లేందుకు వీలుగా డ్రైనేజీ నిర్మించాలని దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతున్నారని కలెక్టర్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకురాగా డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కరకగూడెంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నవోదయ పాఠశాలలో ఏర్పాటు చేసిన తరగతి గదులు మరుగుదొడ్లు ఇతర మౌలిక సదుపాయాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యత్యా సంవత్సరంలో నవోదయ పాఠశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరిశీలనలో కలెక్టర్ వెంట మండల విద్యాశాఖ అధికారి మంజుల, తాసిల్దార్ ఘంటా ప్రతాప్, డిప్యూటీ తాసిల్దార్ కాంతారావు, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ఆర్ ఐ కృష్ణ ప్రసాద్, ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

TGTEL/25/A0784 www.prabhatasurya.com

# అదనపు కలెక్టర్‌గా చంద్రా రెడ్డి బాధ్యతలు స్వీకరణ



రంగారెడ్డి కలెక్టరేట్ -నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 4)

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి.సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొంగరకలాన్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్ అదనపు కలెక్టర్ కు స్వాగతం పలికి, పరిచయం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా గతంలో అదనపు కలెక్టర్ గా పని చేసిన ఎం.వి.భూపాల్ రెడ్డి ఏసీబీ కేసులో అరెస్ట్ కావడంతో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ గారికి ఇన్ చార్జి బాధ్యతలు అప్పగించడం జరిగినది. ప్రస్తుతం ప్రతిమా సింగ్ గారు మెటర్నిటీ సెలవులో వెళ్లడంతో ప్రభుత్వం హెచ్ఎండీఎ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ఓఎస్డీగా పని చేస్తున్న శ్రీ కె.చంద్రా రెడ్డిని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా ప్రభుత్వం ఇటీవలే బదిలీ చేసింది. ఈ మేరకు అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి సోమవారం ఇక్కడికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.

# డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్ఛైజ్ ఆఫ్ తెలంగాణను యువత సద్వినియోగం చేసుకోవాలి



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్- నేటి ప్రభాతసూర్య (ఆగస్టు 4)

రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డిఈఈటి) ను ప్రారంభించిందని, యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ డి ఈఈ టి పోస్టర్‌ను ఆవిష్కరించారు. తరువాత, రాష్ట్రంలోని ప్రైవేట్ సంస్థలలో నిరుద్యోగ యువతకు నిరంతర ఉపాధి కల్పించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ( ఏ వన్) ద్వారా ఆధారితమైన డీఈఈటి వెబ్‌సైట్‌ను గత సంవత్సరం డిసెంబర్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించారని ఆయన అన్నారు. నిరుద్యోగులు ఈ వెబ్‌సైట్‌లో ఉచితంగా నమోదు చేసుకోవచ్చని మరియు డిఈఈటి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా, వారు విద్యా అర్హతలు, నైపుణ్యాలు వంటి ప్రాథమిక సమాచారంతో వారి ప్రొఫైల్‌లను పూర్తి చేయాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు.దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు వారి నైపుణ్యాలు, విద్యా అర్హతలు, నివాస ప్రాంతం మొదలైన వాటి ఆధారంగా ఉద్యోగ సమాచారం అందించబడుతుందని, తయారీ, ఐటీ, ఫార్మా, వ్యవసాయ యజమానులు (యజమానులు) ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసుకుని, అవసరమైన నైపుణ్యాలు, అనుభవం మరియు అర్హతలను తెలియజేస్తూ ఉద్యోగ సమాచారాన్ని అందిస్తారని కలెక్టర్ వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ( ఎవన్) ఆధారంగా పనిచేసే ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ నిరుద్యోగులకు మరియు ఉద్యోగస్థులకు మధ్య ప్రధాన వారధిగా పనిచేస్తుందని, యువత కోరుకునే నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వివిధ నైపుణ్య శిక్షణ సంస్థలు అందించే కోర్సుల సమాచారాన్ని కూడా అందిస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఐఐటీలు, పాలిటెక్నిక్‌లు, డిగ్రీలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన శిక్షణ, వాటిని పూర్తి చేసిన వారికి శిక్షణా కోర్సుల గురించి కూడా ఇది సమాచారాన్ని అందిస్తుందని ఆయన అన్నారు. ప్రైవేట్ రంగంలో నిరంతర ఉపాధి లక్ష్యంగా ప్రారంభించిన ఈ డీఈఈటీలో వెంటనే నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డిఆర్ఓ సంగీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణిలో అద్దె వాహనాలకు దరఖాస్తుల ఆహ్వానం




మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాతా సూర్య. ఆగష్టు 4:

సింగరేణి కార్మికుల ఉత్తమ సేవలందించేందుకు అద్దె వాహనాల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మందమర్రి ఏరియా యాజమాన్యం ప్రకటించింది. ఏరియా పరిధిలోని కెకె ఓసీపీ, రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్‌కు అవసరమైన ఏసీ అంబులెన్స్, క్యాంపర్ వాహనాలను 3 నుంచి 5 ఏళ్ల పాటు యూనిట్ విధానంలో అద్దే ప్రాతిపదికన నడుపేందుకు ఆశాజనకులైన వాహనదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సంబంధిత దరఖాస్తులను మంగళవారం (అగస్టు 6) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్యలో మందమర్రి జీఎం కార్యాలయంలో స్వయంగా సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అర్హులైన పరిశ్రమలు, వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఉమ్మెంత్యల - లాలపేట వాగు ఉధృత ప్రవాహం

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- శాశ్వత పరిష్కారం కోరుతున్న ప్రజలు





షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్, అల్వాల దర్శన్ గౌడ్ (ఆగస్టు 4):

షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్ మండలంలోని ఉమ్మెంత్యల- లాలపేట ప్రాంతంలో వర్షాల కారణంగా వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు, వైద్య అవసరాలకు గానూ గమ్యస్థానాలకు చేరలేకపోతున్న పరి స్థితి నెలకొంది.వాగు వస్తే స్కూల్ కుదరదు" అంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు, కార్మికులు, స్థానికులు రోజువారీ జీవనాధారమే కష్టాల్లో పడిపోయిందని బాధలు వెల్లబోసుకుంటున్నారు.గతంలో కూడా అనేక సార్లు బ్రిడ్జి నిర్మాణానికి డిమాండ్ చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, అధికారుల హామీలు మాటలకే పరిమితమయ్యాయని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "పాలకులు మారినా పరిస్థితి మారలేదు" అంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.శాశ్వతంగా బ్రిడ్జి నిర్మించి ప్రజల కష్టాలను తొలగించాలని అధికారులు తక్షణమే స్పందించాలిఅనిగ్రామాలప్రజలు కోరుతున్నారు.

# ప్రజావాణికి 82 ఫిర్యాదులు





రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్- నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 4)

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (82) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ- 57, ఇతర శాఖలకు - 25, మొత్తం 82 దరఖాస్తులు అందాయి.అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ హాస్టల్స్ , పాఠశాల విద్యార్థులకు అందించే ఆహారాన్ని తయారు చేసే చోటు, వంటగది పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# దేవరకొండ సీఐగా పోసిరెడ్డి వెంకట్ రెడ్డి




దేవరకొండ -నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 4)

దేవరకొండ పోలీస్ స్టేషన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పోసిరెడ్డి వెంకట్ రెడ్డి. శ్రీ సేవ ఫౌండేషన్ అధ్యక్షులు మిడిదొడ్డి నరసింహ్మా మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు పోసిరెడ్డి వెంకట్ రెడ్డిని భవిష్యత్తులో విజయవంతంగా విధి నిర్వహణ చేయాలని, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మిడిదొడ్డి నరసింహ్మా,డి వెంకటేష్ పాల్గొన్నారు.

# ముమ్మరంగా కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు




చింతపల్లి- నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 4)

చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్ (మాల్) లోనీ అంగన్వాడి రెండవ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. సిడిపిఓ సక్కుబాయి ఆదేశాల మేరకు తల్లిపాల వారోత్సవాల నిర్వహణ కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సువర్వైసర్ సుగుణ హాజరై మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి టీచర్లు కృషి చేయాలన్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషక ఆహారం సక్రమంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు బాదేపల్లి స్వప్న, పారిజాత, ఆయాలు బక్కమ్మ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ప్రీ నియర్ షిప్ సాధించడానికి సింబియాసిస్ యూనివర్సిటీ మెరుగైన వేదిక

## విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

## రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేస్ రంజన్

## సైబర్ క్రైమ్ డిసిపి సాయి శ్రీ





(నేటి ప్రభాత సూర్య నందిగామ ఆగస్టు 4)

అట్టహాసంగా ప్రారంభమైన సింబయోసిస్ దీక్షారంబ్ - 2025 వేడుకలు

నేటి యువత తమకు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పిలుపునిచ్చారు. సోమవారం నందిగామ మండలంలోని సింబయోసిస్ డీమ్డ్ యూనివర్సిటీలో ఎస్ ఐ టి డైరక్టర్ డాక్టర్ రజినీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షారంబ్ - 2025 ప్రారంభోత్సవ వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆగస్టు 4 నుండి 16 వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకల్రప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పాటు కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డిసిపి సాయి శ్రీ, యూఎస్ ఆర్మీ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ విజయకుమార్ మిశ్రా, ప్రముఖ సంస్థ జెలిస్ ఇండియా హెడ్ వేణుగోపాల్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అనంతరం దీక్షారంబ్ వేడుకలో విద్యార్థులను ఉద్దేశించి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జేయేస్ రంజన్ మాట్లాడుతూ పలు సూచనలు సలహాలు అందించారు. గతంలో తాను ట్రిబుల్ ఐటీల్లో జరిగే సమావేశాలకు హాజరయ్యే వాడినని ఆ సమయంలో అక్కడ ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసుకున్న వారికి వచ్చిన ప్లేస్మెంట్ గురించి ఒకరి యాజమాన్యాలు తెలిపేవన్నారు. అయితే ఉన్న విద్యార్థుల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్లేస్మెంట్లు రానివారు ఎంతమంది ఉన్నారు..? వారికి ప్రెస్ మీట్ రాకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకునే వాడినని చెప్పుకొచ్చారు. ఆ సందర్భంలో తనకు తెలిసిన విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. అక్కడ చదివిన విద్యార్థులు ఎక్కువగా సొంతంగా ఇంటర్ పెర్నియర్ షిప్ ( ఏదైనా కొత్త ప్రాజెక్టు ద్వారా సొంతంగా ఉద్యోగాల కల్పన వంటి అంశాలు) పై మక్కువ చూపడం, మరి కొంతమంది ఉన్నచ చదువుల కోసం ఇతర దేశాలకు, సొంత కంపెనీలు ప్రారంభించేందుకు మక్కువ ఉన్నవారు ఆ ప్లేస్మెంట్లకు దూరంగా ఉన్నట్లు తెలిసింది అన్నారు. ఎంటర్ప్రెన్నియర్ షిప్ కోసం ఒక ప్రత్యేక వ్యవస్థ అవసరమవుతుందని ఇందుకోసం ప్రత్యేకంగా ప్లేస్మెంట్స్ సెల్ తో పాటు ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటివి ఎన్నో అవసరమవుతుందని, వాటిని వెతుక్కుంటూ కొంతమంది విద్యార్థులు ఎక్కడెక్కడికో పరుగులు పెడుతున్నారన్నారు. హైదరాబాద్ కు చేరువలో ఉన్న సింబయోసిస్ యూనివర్సిటీలో ఎంటర్ప్రెన్నియర్షిప్ వంటి లక్ష్యాలను సాధించేందుకు అన్ని సౌకర్యాలు కలిగి ఉండటం చూసిన తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. సింబయోసిస్ యూనివర్సిటీనీ ఎంచుకుని విద్యార్థుల తల్లితండ్రులు మంచి నిర్ణయం తీసుకున్నారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలుచుకొని విజయం దిశగా అడుగు వేయాలని ఆకాంక్షించారు. అనంతరం సైబర్ క్రైమ్ డిసిపి సాయి శ్రీ మాట్లాడుతూ జీవితం అనేది కేవలం చదువు, జాబ్, డబ్బు సాధించడం మాత్రమే కాదని, మన జీవితంలో జరిగే ప్రతి సంఘటన సమాజానికి ముడిపడి ఉంటుందన్నారు. ప్రతి మనిషి జీవితంలో శ్రద్ధ, ఆసక్తి , క్రమశిక్షణ వంటి అంశాలు ఎంతో ముఖ్యమన్నారు. చదువుతోపాటు సమాజంలో ఉన్నతమైన జీవనం సాగించే విధంగా ప్రతి ఒక్కరూ తమ విధివిధానాలను రూపొందించుకోవాలని తెలిపారు.

# గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి





అబ్దుల్లాపూర్ మెట్ -నేటి ప్రభాత సూర్య:

గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం అబ్దుల్లాపూర్ మెట్ మండలం పరిధిలోని అనాజ్ పూర్,గుంతపల్లి,మజీద్ పూర్ గ్రామాలలో దాదాపురూ.. 80 లక్షలతో నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు. ముందుగా అనాజ్ పూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఏడు తల కాయల మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులు అయినా మంజూరు చేస్తామని, అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ప్రతి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు,200 యూనిట్ల లోపు గృహ జ్యోతి అమలు, అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు మంజూరు ,సన్న బియ్యం పంపిణీ రైతు బరోసా రైతు ఋణ మాఫీ అందించామని తెలిపారు.మహిళల కు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా బస్సు సౌకర్యం,వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు.గత ప్రభుత్వం లో అభివృద్ధికి గ్రామాలు నోచుకోలేదని కేవలం గత ప్రభుత్వం కమిషన్లు దండుకోని గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రోజు ప్రజల కోసం పని చేస్తున్నామని చెప్పారు.ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మహిళా సంఘం సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి,వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరాచారి, మాజీ జెడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్,మండల పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్,కరిమెల వెంకటేష్, మాజీ ఎంపీటీసీ మేడిపల్లి బాలమ్మ, వెంకటేష్ తో పాటు నాయకులు గుండ్లపల్లి ధన్ రాజ్ గౌడ్ ,ఏళ్ల బాల్ రెడ్డి,ఏళ్ల నరేందర్ రెడ్డి,ఏర్కలి అశోక్ గౌడ్,పాలెం శ్రీనివాస్ గౌడ్, ఏర్పుల శివయ్య, నార్లకొండ శ్రీశైలం యాదవ్,కంటేకార్ రమేష్, శ్రీధర్, ఎండీ, అఫ్సర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# మందమర్రి పట్టణంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**మంచిర్యాల జిల్లా, నేటి ప్రభాత సూర్య:,ఆగష్టు 4:**
మందమర్రి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్మిక, మైనింగ్ %ద% ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.చెక్కులను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, ఉమ్మడి జిల్ల ఫార్మర్ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్కు దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరి చెక్కులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పట్టణంలోని 24 వార్డుల బాధ్యులు అనరహతుల అభ్యర్థులకు సమాచారాన్ని అందజేస్తారని చెప్పారు.ఈ పంపిణీ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకుడు కడారి జీవన్ కుమార్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆఫీస్ పైడిమల్ల నర్సింగ్, పట్టణ సేవాదళ్ అధ్యక్షుడు సోతుకు ఉదయ్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మాయ తిరుపతి, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బుర్ర ఆంజనేయ గౌడ్, ఎండి ఖలీల్, ఆడెపు వేణు, జలీల్, గజ్జల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పాలిటెక్నిక్ మరో 66 సీట్లు ఖాళీ



**మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాత సూర్య: ఆగష్టు 4:**
మందమర్రి జీఎం కార్యాలయం నుండి పత్రిక ప్రకటన విడుదల చేశారు. సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్, సి.సి.సి. నస్పూర్ నందు 2025-26 విద్యా సంవత్సరంకు సంబంధించి సింగరేణి కోటాలో మిగిలి ఉన్న 66 సీట్లు (సివిల్ -27, ఎలక్ట్రికల్ - ఎలక్ట్రానిక్స్ -06, మెకానికల్ -23. మైనింగ్-10) కు తక్షణ ప్రవేశాలు జరుగుతున్నాయి. గవర్నమెంట్ కన్వీనర్ కోటాలో మిగిలి ఉన్న సీట్లు ఈ నెల ఏడవ తేదీన కౌన్సెల్లింగ్ రోజున తెలుస్తాయి. ఈ అవకాశంను విద్యార్థులు సద్వినియోగము చేసుకోవాలని.. ఇతర కాలేజీలలో సీటు పొందిన విద్యార్థులు సీటు రద్దు చేసుకొని రావాలి. లేనిచో సీటు కేటాయించమని.. అలాగే రిజిస్ట్రేషన్, వివరముల కొరకు కామెంట్. స్పందించి స్పాట్ అడ్మిషన్ను పాలిసెట్ 2025లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులతో సీట్లను భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# కోలాహలంగా అభివృద్ధి పనుల జాతర

**పనులు త్వరితగతిన పూర్తిచేయించే బాధ్యత అధికారులకే.**

**కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.**



**నేటి ప్రభాత సూర్య:**
కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు జాతరను తలపించాయి. మూడు మండలాల పరిధిలో ఎన్ఆర్ఈజిఎస్, సిఆర్ఆర్, ఎస్సిపి, డిఎంఎఫ్టి, వివిధ సంస్థల సిఎస్ఆర్ నిధులు రూ.665.31కోట్లు మంజూరు కాగా ఈ నిధులతో పూర్తయిన పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. కొత్తగూడెం పట్టణంలో జెన్కో సిఆర్ఆర్ నిధులు రూ.కోటితో నిర్మించనున్న బిసి బాలికల భవన సముదాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ ఒక్కరోజే 103 పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయని, లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని సాటివారిగూడెం, చాతకొండ, హమాలీ కాలనీ, సంజయ్ నగర్, అశోక్ నగర్ పంచాయతీల్లో రూ.414.5కోట్లు, చుంచుపల్లి మండలంలో రూ.64లక్షలు, సుజాతనగర్ మండలంలో రూ.87.37లక్షలతో సిసి రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలు, వాటర్ ట్యాంకుల ప్రారంభోత్సావాలు, శంకుస్థాపనలు చేశామని తెలిపారు. రాష్ట్రంలోనే కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు తపిస్తున్నాని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేవరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు. గ్రామాలు, బస్తీల్లో అభివృద్ధి నిధుల కేటాయింపులో ఎలాంటి వ్యత్యాసం ఉండబోదని, ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేపడుతున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం, జాప్యాన్ని సహించబోనని, దీనికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. పనులు నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పూర్తయిన పనుల నిర్వహణ బాధ్యత మున్సిపల్, గ్రామపంచాయతి, ఇతర ప్రభుత్వ శాఖలదేనన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఈఈ వెంకటేశ్వర్ రావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిర, పంచాయతిరాజ్ డిఈ రామకృష్ణ, ఏఈ శివలాల్, మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ శాఖా, ఐటిసిఏ అధికారులు, వ్యవసాయ శాఖ, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్, సత్యనారాయణాచారి, నేరెళ్ల రమేష్, నేరెళ్ల శ్రీనివాస్, జగన్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# పైసా పేకో తమషా దేకో.....




- ఆదిబట్ల మున్సిపల్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..
- అక్రమ నిర్మాణాలపై చలనంలేని అధికారులు...
- పత్రికల్లో కథనాలు వచ్చినా చర్యలకు వెనుకడుగు..
- టౌన్ ప్లానింగ్ పనితీరుపై తీవ్ర విమర్శలు





**పైసా పేకో తమషా దేకో అన్న చందంగా తయారైంది. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.ఏలాంటి అనుమతులు లేకుండా నిబంధనలు తుంగలో తొక్కి సెల్లార్‌తో పాటు బహుళ అంతస్తు భవనం నిర్మిస్తు న్నారు. వీటికి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సహకరిస్తుం డటంతోనే అనుమతులు లేని నిర్మాణాలు విచ్చలవిడిగా వెలుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.**

**ఆదిబట్ల -నేటి ప్రభాత సూర్య:**
నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా తయారైంది ఆది బట్ల మున్సిపల్ పరిస్థితి. మున్సిపల్ పరిధిలో అక్రమ, అదనపు అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.ఆ భవనాలలో పా ర్కింగ్ సదుపాయం, సెట్‌బ్యాకు లేకపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. విచ్చలవిడిగా సాగుతున్న నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. పట్టించుకోకపోవడంతో మున్సిపల్ తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.. నిబంధనలకు మించి నిర్మాణం చేపడితే నోటీసులు ఇచ్చి సదరు నిర్మాణాన్ని నేలమట్టం చేస్తాం'..ఇది టౌన్‌ప్లానింగ్ అధికారులు, కమిషనర్ చెప్పే మాట..కానీ క్షేత్రస్థాయిలో మాత్రం కాసులకు కక్కుర్తి పడుతూ అక్రమార్కులకు అధికారులు కొమ్ముకాస్తున్నారు. అనుమతులు ఇచ్చి వదిలేస్తున్నారు. కానీ అనుమతి పొందిన నిర్మాణదారుడు అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులతో చెలరేగిపోతున్నా..ఆ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఫిర్యాదు చేసినా..ఒత్తిడి తెచ్చినా.. కేవలం నోటీసులతో సరిపెడుతున్నారే తప్ప.. ఆపై చర్యలకు వెళ్లడం లేదు

**రెసిడెన్షియల్ అనుమతులు, కమర్షియల్ నిర్మాణాలు...**
ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఇంజినీరింగ్ కాలేజీలు, విద్యా సంస్థలు పెద్ద ఎత్తున ఉన్నాయి. దీంతో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు గణ నీయంగా పెరుగుతోంది. హాస్టళ్లకు డిమాండ్ ఉంది. దీన్ని ఆసరగా చేసుకుంటున్న అక్రమ నిర్మాణదారులు... రెసిడెన్షియల్ అను మతులు తీసుకొని... కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారు. అక్ర మంగా పెంట్ హౌస్‌లు నిర్మిస్తున్నారు. చిన్న స్థలంలో పెద్ద నిర్మా ణాలు చేపడుతూ భద్రతకు తిలోదకాలిస్తున్నారు. ఇంత జరుగు తున్నా అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేకపోవడం పట్ల స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**స్పందించని మున్సిపల్ కమిషనర్...**
ఆదిభట్ల మున్సిపల్ పరిధిలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ ను వివరణ కోరేందుకు ' నేటి ప్రభాత సూర్య ప్రతినిధి చరవాణిలో ప్రయత్నించగా ఆయన స్పందించకపోవడం గమనార్హం.



# సీసీటీవీ కెమెరాలకు విరాళం

**మంచిర్యాల జిల్లా, నేటి ప్రభాత సూర్య:, ఆగష్టు 4:**
బెల్లంపల్లి నియోజకవర్గానికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్, కీశే డా. తోడె వంశీకృష్ణారెడ్డి జయంతి (ఆగస్టు 6)ను పురస్కరించుకుని ఆయన స్మృతిని తరతరాలకు చాటేందుకు వారి సోదరుడు తోడె వెంకటకృష్ణారెడ్డి స్ఫూర్తిదాయక సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ క్రమంలో బెల్లంపల్లి పీఎస్ వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ , ఎస్ఐ లకు బూడిదగడ్డ బస్తీలోని వివిధ ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయుటకు రూ.30,000/-లను విరాళంగా అందజేశారు. వివిధ నేర చర్యలను నియంత్రించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకై ఈ సాంకేతిక వసతులు ఉపయో గపడతాయి. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి న్యాయవాది మాదరి రాకేష్, 22వ వార్డు కాంగ్రెస్ నాయకులు పీక లక్ష్మణ్ తది తరులు పాల్గొన్నారు. ఇదివరకు కూడా స్వర్గీయ వంశీకృష్ణారెడ్డి స్మారకార్థంగా ఎమ్మెల్యే శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి చేతుల మీదుగా బెల్లంపల్లి నియోజకవర్గ యువతకు రూ.2.75 లక్షల విలువైన స్పోర్ట్స్ కిట్లను పంపిణీ, ఇంటర్మీడియట్ ఫలితాల్లో



ఉత్తీర్ణతలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.30,000 ప్రోత్సాహకాలు, బెల్లంపల్లి గ్రంథాలయానికి రూ.2 లక్షల విలువైన పుస్తకాలు, అలాగే తాండూర్, లక్షెట్టిపేట మండలాల యువతకూ పుస్తకాలు అందజేయడం జరిగింది. మనా కాదు నిరుద్యోగ యువతకు సాయంగా బెల్లంపల్లి గ్రంథాలయంలో నాలుగు నెలలపాటు శని, ఆదివారాల్లో నిర్వహించిన పోటీ పరీక్షలకు ఉచిత భోజన వసతి కూడా కల్పించారు.

# సమాజ సేవకు కట్టుబడతా

**కీర్తి రత్న పురస్కార అవార్డు అందుకున్న కర్ణం కార్తీక్**

**స్నేహితుల దినోత్సవం రోజు అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది**

**సమాజ సేవకుడు కర్ణం కార్తీక్**

**నేటి ప్రభాత సూర్య:**
హైదరాబాద్ లోని మెగా హెల్పింగ్ ఫౌండేషన్, శిరీష రెడ్డి ఆధ్వర్యంలో బిర్లా భాస్కర్ ఆడిటోరియం వేదికగా సినీ రచయిత జ్వాల చక్రవర్తి,సినీ హీరో సూర్య చేతుల మీదగా సమాజ సేవకుడు కర్ణం కార్తీక్ కు కీర్తి రత్న పురస్కార అవార్డు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాలు చేయుటకు ఈ అవార్డు మరింత బాధ్యత ను పెంచిందని ఆయన అన్నారు. ఈ అవార్డు స్నేహి తుల దినోత్సవం రోజు రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని ఆయన అన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన బి.ఎన్.ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్దం శ్రీనివాస్, మహబూబ్నగర్ జిల్లా కరాటే అధ్యక్షులు, ఎన్పిఎస్కెఐ వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్, రైల్వే శ్రీను, మసూద్ లు పాల్గొని కరణం కార్తీక్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784


## క్రీడారంగం

# భారత్ అద్భుత విజయం

- రసవత్తరంగా సాగిన మ్యాచ్
- భారత్ 6 పరుగుల తేడాతో విన్
- ఐదు టెస్టుల సిరీస్ 2-2తో సమం



లండన్ ఓవల్ టెస్టులో భారత్ అద్భుత విజయం సాధించింది. ఐదో మ్యాచ్‌లో నెగ్గాలంటే 35 పరుగులు కాపాడుకుంటూ, నాలుగు వికెట్లు పడగొట్టాల్సిన దశలో టీమ్ఇండియా అద్భుతంగా పోరాడింది. 339-6తో బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్‌ను 367 పరుగులకే ఆలౌట్ చేసింది. రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ 6 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో సమం అయ్యింది. 339-6తో ఐదో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్, మరో 28 పరుగులు చేసి చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. 374 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ 367 స్కోర్‌కే ఆలౌటైంది. ఐదో రోజు ఇంగ్లాండ్ చేతిలో నాలుగు వికెట్లతో, 35 పరుగులు కావాల్సిన దశలో ఆట ప్రారంభించింది. ఈ దశలో టీమ్ఇండియా ఐదో రోజు తొలి ఓవర్‌లోనే జెమీ స్మిత్ వికెట్ తీసింది. ఆ తర్వాత జెమ్మీ ఓవర్టన్, జోష్ టంగ్ వికెట్లు కూడా తొందరగానే కూల్చినా, గస్ అట్కిసన్ (29 బంతుల్లో 17 పరుగులు) పోరాడాడు. మరోవైపు, గాయపడిన వోక్స్ బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈ దశలో అట్కిసన్ పోరాడాడు. వీలుచికినప్పుడల్లా పరుగులు సాధిస్తూ, టీమ్ఇండియా అభిమానుల్లో గుబులు రేపాడు. కానీ, చివర్లో సిరాజ్ అద్భుత బంతికి అట్కిసన్‌ను బౌల్డ్ చేసి జట్టుకు విజయం ఖరారు చేశాడు. టీమ్ఇండియా బౌలర్లలో మహ్మద్ సిరాజ్ 5, ప్రసిద్ధ్ కృష్ణ 4, ఆకాశ్ దీప్ 1 వికెట్ దక్కించుకున్నారు.



## సిరాజ్ అద్భుత ప్రదర్శనతోనే గెలిచాం


**టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్**

మహమ్మద్ సిరాజ్ అద్భుత ప్రదర్శనతోనే ఓడిపోయే మ్యాచ్‌లో విజయం సాధించామని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. అతను జట్టులో ఉండటం తమ అదృష్టమని చెప్పాడు. ఉత్కంఠగా సాగిన ఆఖరి టెస్ట్‌లో టీమిండియా 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. 339/6 ఓవర్ నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్.. 367 పరుగులకు ఆలౌటైంది. మహమ్మద్ సిరాజ్(5/104) ఐదు వికెట్లతో భారత్‌కు చిరస్మరణీయ వియాజయాన్నందించాడు. సిరాజ్‌తో పాటు ప్రసిధ్ కృష్ణ(4/126) నాలుగు వికెట్లు తీయగా ఆకాష్ దీప్ ఓ వికెట్ పడగొట్టాడు. ఈ గెలుపుతో ఐదు టెస్ట్‌ల సిరీస్ 2-2తో సమంగా నిలిచింది. ఈ సిరీస్‌లో అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన శుభ్‌మన్ గిల్.. భారత్ తరపున ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన శుభ్‌మన్ గిల్.. కెప్టెన్‌గా ఈ సిరీస్‌ను సమం చేసుకోవడం సంతోషంగా ఉందన్నాడు. 'ఈ సిరీస్ హోరా హోరీగా సాగింది. ప్రతీ మ్యాచ్‌లోనూ ఆఖరి రోజు వరకు ఏ జట్టు గెలుస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇది ఇరు జట్ల అత్యుత్తమ ప్రదర్శనను తెలియజేస్తోంది. తప్పక గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో విజయం సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో కెప్టెన్‌గా నా పని సులువైంది. బంతి రెండు వైపులా స్వింగ్ కావడంతో ఇంగ్లండ్ బ్యాటర్లు ఒత్తిడికి లోనయ్యారు. ఈ ఉదయం మా బౌలర్ల స్పెల్ అద్భుతం. ఈ విజయంపై మేం చాలా నమ్మకంగా ఉన్నాం. ఇంగ్లండ్ బ్యాటర్లు నిన్న కూడా ఒత్తిడిలో కనిపించారు. ఒత్తిడిలో చాలా తప్పిదాలు జరుగుతాయి. నాలుగో రోజు ఆట ఆఖరి సెషన్‌లో వారు చేసిన 36 పరుగులను ఒత్తిడిలోనే చేశారు. సిరాజ్‌లాంటి బౌలర్‌ను ప్రతీ కెప్టెన్ కావాలనుకుంటాడు.

## విడాకులపై సైనా-కశ్యప్ యూటర్న్



ఇటీవలె విడిపోతున్నట్లు ప్రకటించిన బ్యాడ్మింటన్ జంట సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ మళ్లీ ఒక్కటయ్యారు. ఈ మేరకు "మళ్లీ ప్రయత్నిస్తున్నాం" అంటూ సైనా శనివారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్ట్ చేసింది. "కొన్నిసార్లు దూరం వల్ల ఉనికి విలువ తెలుస్తుంది. బంధాన్ని కొనసాగించేందుకు మేము మళ్లీ ప్రయత్నిస్తున్నాం" అని పోస్ట్‌లో పేర్కొంది. కశ్యప్‌తో కలిసి ఉన్న ఫొటోను ఆమె షేర్ చేశారు. కాగా, అంతకు ముందు గత నెలలో సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ తమ ఏడేళ్ల వివాహ బంధానికి ముగింపు పలుకుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్వయంగా సైనా వెల్లడించారు. ఎంతో ఆలోచించి, చర్చించిన అనంతరం తాను, కశ్యప్ విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు సైనా ప్రకటించారు. "జీవితం కొన్ని సార్లు మనల్ని విభిన్న మార్గంలోకి తీసుకెళ్తుంది. సుదీర్ఘ చర్చలు ఎన్నో ఆలోచనల తర్వాత నేను, కశ్యప్ విడిపోవాలని నిర్ణయించుకున్నాం. ప్రశాంతతను ఎంచుకున్నాం. ఈ సమయంలో మా గోప్యతకు గౌరవం ఇస్తారని భావిస్తున్నాం" అని సైనా తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ తీసుకుంటుండగా వీరి మధ్య స్నేహం మొదలైంది. ఆ తర్వాత ప్రేమగా మారగా, 2018లో సైనా, కశ్యప్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గత కొంతకాలంగా వరుసగా గాయాల బారిన పడిన సైనా, ఫామ్‌ను కోల్పోయారు. చివరిసారిగా 2023 జూన్‌లో ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో ఆడారు. తాను ఆర్థరైటిస్‌తో బాధపడు తున్నట్లు గతేడాది ప్రకటించిన సైనా, కెరీర్‌పై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. సైనా ఒలింపిక్ కాంస్య పతకం, ప్రపంచ నెంబర్ వన్ ర్యాంకింగ్‌తో ప్రపంచ ఐకాన్‌గా మారారు. సైనా అద్భుత కృషికి గానూ 2009లో అర్జున అవార్డు, 2010లో రాజీవ్ గాంధీ ఖేల్ రత్న అవార్డులన్ను ఆమె అందుకున్నారు. సైనా ప్రధాన బ్యాడ్మింటన్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే కాక ట్రోఫీలు, పతకాలను కూడా సాధించారు.




## ఎన్టీఆర్ డ్యాన్స్ అదుర్స్

**వార్-2 ప్రచారంలో హృతిక్ రోషన్**

ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రం 'వార్ 2' ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా వీరిద్దరూ వరుస పోస్టులతో ఆడియన్స్‌లో జోష్ పెంచారు. ఈ సినిమాలో ఎన్టీఆర్, హృతిక్ పోటాపోటీగా తలపడనున్న విషయం తెలిసిందే. ఇప్పుడు సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్ విషయంలోనూ ఈ ఇద్దరూ పోటీపడ్డారు. మాటల యుద్ధం ప్రారంభించారు. ప్రచారంలో హృతిక్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఎన్టీఆర్ డ్యాన్స్‌పై ప్రశంసలు కురిపించారు. 'నేను ఇప్పటివరకూ వర్క్ చేసిన సహనటుల్లో రిహార్సల్స్ అవసరం లేని ఒకేఒక్క హీరో ఎన్టీఆర్. ఎంత కష్టమైన మూమెంట్ అయినా ఆయన ప్రత్యేకంగా రిహార్సల్స్ చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రతి స్టెప్ ఆయనకి సులభమే. ఈ సినిమా షూటింగ్ సమయంలో తన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని తెలిపారు.

## శ్రీవారి సన్నిధిలో కొడుక్కి పేరు



సినీనటుడు కిరణ్ అబ్బవరం తిరుమల శ్రీవారిని దర్శించు కున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కిరణ్ అబ్బవరం తన సతీమణి రహస్య గోరక్‌తో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తన కుమారుడు హనుమ జయంతి రోజు జన్మించాడని, అందుకే హను అబ్బవరం అనే పేరు పెట్టినట్లు చెప్పారు.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

## సినిమా

## జటాధర ఫస్ట్ లుక్ అదుర్స్

సుధీర్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న చిత్రం 'జటాధర'. వెంకట్ కళ్యాణ్ దర్శకత్వంలో తేరకెక్కుతున్న ఈ సినిమాలో సుధీర్ బాబుతోపాటు బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా, శిల్పా శిరోద్కర్, రవి ప్రకాష్, ఇంద్ర కృష్ణ, నవీన్ నేని, శుభలేఖ సుధాకర్, రాజీవ్ కనకాల, ఝాన్సీ నటిస్తున్నారు. జటాధర చిత్రాన్ని ప్రేరణ అరోరా, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్ నిర్మిస్తుండగా ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్స్ ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేయగా. ఈ సినిమా నుంచి సాలిడ్ అప్డేట్ ఇచ్చేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది. 'జటాధర' మూవీకి సంబంధించిన టీజర్‌ను ఆగస్టు 8న విడుదల చేయబోతున్నట్లు అధికారంకంగా ప్రకటించారు . అలాగే ఓ పవర్ ఫుల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ప్రజంట్ ఈ న్యూస్ వైరల్ అవుతుండడంతో సుధీర్ బాబు అభిమానులు ఫుల్ ఖుష్ అవుతున్నారు.



## కూలీలో సైమన్ పాత్రలో ఒదిగిన నాగ్

**ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రజనీ ప్రశంసలు**

'కూలీ' కథ చెప్పగానే అందులో సైమన్ పాత్ర తాను చేయాలన్నంత ఆసక్తి కలిగిందని దాన్ని నాగార్జున లాంటి నటుడు పోషించి అదరగొట్టారని అగ్ర కథానాయకుడు రజనీకాంత్ అన్నారు. ఆయన కీలక పాత్రలో లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ' ఆగస్టు 14న విడుదల కానుంది. ఈసందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో రజనీకాంత్ స్పెషల్ వీడియోతో తెలుగు వారిని పలకరించారు. తెలుగు సినీ ప్రేక్షకులకు నా నమస్కారం. నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు. ఈ సంవత్సరంలో లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నేను నటించిన 'కూలీ' ఆగస్టు 14న రావడం సంతోషంగా ఉంది. తెలుగులో రాజమౌళి ఎలాగో తమిళంలో లోకేశ్ కనగరాజ్ అలా. ఆయన చేసిన సినిమాలన్నీ హిట్. ఇంకొక గొప్ప విషయం ఏంటంటే, ఇందులో పలువురు స్టార్స్ నటించారు. చాలాఏళ్ల తర్వాత సత్యరాజ్‌తో చేస్తున్నా. ఇక శ్రుతిహాసన్, ఉపేంద్ర, సౌబిన్‌లతో పాటు- ఆమిర్‌ఖాన్ స్పెషల్ అపియరెన్స్ ఉంది. ముఖ్యంగా నాగార్జున ఇందులో విలన్‌గా చేస్తున్నారు. అసలు 'కూలీ' సబ్జెక్ట్ విన్న వింటనే సైమన్ పాత్ర నేనే చేయాలన్న ఆసక్తి కలిగింది. ఆ పాత్ర ఎవరు చేస్తారా? అని ఎదురుచూశా. ఎందుకంటే చాలా స్టైలిష్‌గా ఉంటుంది. ఆర్నెళ్ల పాటు వెతికాం. ఈ పాత్ర గురించి ఒక నటుడితో ఆరుసార్లు సిటింగ్ అయింది. అయినా ఓకే అవలేదు' అని లోకేశ్ నాతో అన్నారు. 'ఎవరు ఆయన' అని నేను అడిగా. నాగార్జున పేరు చెప్పగానే ఆశ్చర్యపోయా. ఆ తర్వాత ఆయన ఒప్పుకొన్నారని తెలిసి సంతోషంగా అనిపించింది. ఎందుకంటే, డబ్బు కోసం సినిమాలు చేసే వ్యక్తి కాదు. ఆయనకు ఆ అవసరం లేదు. మేమిద్దరం 33 ఏళ్ల కిందట ఒక సినిమా చేశాం. అప్పుడు ఎలా ఉన్నారో, ఇప్పుడూ అలాగే ఉన్నారు. నాకు జుట్టు కూడా ఊడిపోయింది. నాగార్జునతో పని చేస్తుండగా 'మీ ఆరోగ్య రహస్యం ఏంటి' అని అడిగాను. 'ఏమీ లేదు సర్.. వ్యాయామం, ఈత, కొద్దిగా డైట్. సాయంత్రం 6 గంటలకు డిన్నర్ అయిపోతుంది. మా తండ్రి నుంచి వచ్చిన జీన్స్ కూడా ఒక కారణం. దాంతో పాటు, నా తండ్రి నాకో సలహా ఇచ్చారు. 'బయట విషయాలు తలలోకి ఎక్కించుకోవద్దని చెప్పారు' అని నాగార్జున నాతో చెప్పారు. 17 రోజుల షెడ్యూల్ కోసం ఇద్దరం థాయ్‌లాండ్ వెళ్లాం. అది నా జీవితంలో మర్చిపోను. సైమన్ పాత్రలో ఆయన నటన చూస్తుంటే, నాకే ఆశ్చర్యమేసింది. బాషా-ఆంటోనీ ఎలాగో.. కూలీ-సైమన్ అలా ఉంటుంది. ఇక ఇందులో అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందరినీ ఆకట్టు-కుంటుందని రజనీకాంత్ అన్నారు.



## సైయారా విజయం అద్భుతం: మోహిత్ సూరి

ప్రేక్షకులు ఎలాంటి సినిమాలకు ఎలా రియాక్ట్ అవుతున్నారో చెప్పడం కష్టతరంగా మారింది. వంద కోట్ల బడ్జెట్‌తో వచ్చిన సినిమాలను కనీసం పటించుకోవడంలేదు. ఊహించని విధంగా చిన్న సినిమాలను మాత్రం ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇందుకు నిదర్శనం 'సైయారా'. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. దీంతో ఈ చిత్ర దర్శకుడు మోహిత్ సూరి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నా 17ఏళ్ల వయస్సులో మొదటిసారి సెట్‌లో అడుగుపెట్టాను. అలా ఐదేళ్లు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసి 22 ఏళ్లకు దర్శకత్వం ప్రారంభించాను. ఇప్పుడు నా వయసు 44 ఏళ్లు. సగం జీవితం సినిమా సెట్‌లలోనే గడిచిపోయింది. అదేంటో తెలీదు కానీ ఆ వాతావరణంలో నేను నాకు నచ్చినట్లు ఉండగలను. సామాజిక కార్యక్రమాల్లో, ఈవెంట్‌లలో నేను మామూలుగా ఉండాలని ప్రయత్నించినా ఇబ్బందిగానే ఉంటుంది. అలాంటి ప్రదేశాల్లో కేవలం దర్శకుడిగా మాత్రమే ఉంటాను. సెట్‌లో మాత్రం అలా కాదు నాకు అక్కడ ఉన్నంత సౌకర్యంగా మరెక్కడా ఉండలేను. జీవితమంతా ఇలానే గడిచిపోవాలని కోరుకుంటున్నాను. నిజజీవితంలో కంటే సెట్‌లోనే స్నేహితులను దక్కించుకున్నాను అని మోహిత్ సూరి తెలిపారు.



Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.